పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# హైదరాబాద్‌లో దాదాపు 10 లక్షల ఓట్లు ఓటర్ల లిస్ట్ నుంచి ఔట్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ జిల్లాలో దాదాపు 10 లక్షల ఓట్లు ఓటర్ల లిస్ట్ నుంచి కనుమరుగు కానున్నాయి. హైదరాబాద్ జిల్లాలో నిర్వహించిన ాx= ప్రక్రియలో ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో ఓటు కలిగి ఇక్కడ కూడా నమోదైన డూప్లికేట్ ఓటర్లు, ఆచూకీ లేనివారు (అబ్సెంట్ ), చనిపోయిన.. ఇలా ఈ మూడు కారణాల వల్ల దాదాపు 9.95 లక్షల ఓటర్లను హైదరాబాద్ జిల్లా ఓటర్ల లిస్ట్ నుంచి తొలగించేందుకు రంగం సిద్ధమైంది. ఇలాంటి ఓటర్లను హైదరాబాద్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూసుకుంటే.. సికింద్రాబాద్ 79 వేల 457 ఓటర్లు, ద

- మిగతా 4లో...



నిర్వహకులు రాజేష్ నాయక్ సమక్షంలో టాస్ వేస్తున్న దృశ్యం..

ఇరు జట్లతో విద్యార్థి జేఏసి నాయకుడు రాజేష్.

# విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతున్న రాజేష్ నాయక్

**దుండిగల్, పెన్ పవర్, ఆగష్టు 5:** ఉస్మానియా లా స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో, ఉస్మానియా విద్యార్థి నాయకుడు రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో గగిల్లాపూర్‌లోని వైఎన్ఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం క్రికెట్, కబడ్డీ, కో-కో క్రీడా టోర్నమెంట్లు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్లను నిర్వహించినట్లు వెల్లడించారు.. టోర్నమెంట్లలో పాల్గొన్న విద్యార్థులు అన్ని విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. విజేతలకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించి గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ నైపుణ్యాలు, సామాజిక బాధ్యత పెంపొందుతాయని అన్నారు.. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థి నాయకులు విజయ్ కుమార్, అభిలాష్ రెడ్డి, సిరిగాళ్ల బాబు, షాబీర్, శేఖర్, అనూష నాయక్‌తో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను అభినందించి ప్రోత్సహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.






- ఉస్మానియా 'లా విద్యార్థి' జేఏసి నాయకుడు రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో..
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, కో-కో టోర్నమెంట్లు..
- విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి విద్యార్థులను చైతన్య పరుస్తున్న రాజేష్..
- గ్రామీణ క్రీడా ప్రతిభకు వేదికగా నిలిచిన గగిల్లాపూర్ క్రీడా టోర్నమెంట్..!

## జీవోలను అమలు చేయాలని కోర్టులు చెప్పగలవా?

శాసనసభ వేదికగా ఎందుకు చర్చించరు? 4లో...

హరీశ్‌రావు, పాయల్ శంకర్‌ల పిటిషన్‌లపై హైకోర్టు




## బతుకమ్మ కుంటలా మారనున్న కూకట్ పల్లి చెరువు..

### ప్రణాళికలు రెడీ చేస్తున్న హైడ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:**కూకట్ పల్లిలోని రంగధాముని చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ప్రణాళికలు రెడీ అవుతున్నాయి. బతుకమ్మ కుంట మాదిరిగా వినాయక చవితి, బతుకమ్మ పండుగలకు నిమజ్జనం జరిగేలా.. స్థానికులకు నిత్యం వాకింగ్ చేసుకునేలా, ఫ్యామిలీతో కలిసి ఉల్లాసంగా గడిపేలా ముస్తాబు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. చెరువు అభివృద్ధిపై 2026 ఆగస్టు 5వ తేదీన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు.

చెరువు అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ఇద్దరూ విస్తృతంగా చర్చించారు. రాబోయే బతుకమ్మ, వినాయక చవితి పండుగల సందర్భంగా రంగధాముని చెరువు వద్ద పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు, వినాయక విగ్రహాల నిమజ్జనం జరుగనున్న క్రమంలో.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైడ్రా కమిషనర్‌కు సూచించారు.అలాగే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువు పరిసర ప్రాంతంలో సుమారు పది ఎకరాల స్థలాన్ని వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖలకు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ ప్రాంతంలో నివాస ప్రాంతాలు అధికంగా ఉన్నందున భవిష్యత్తులో మౌలిక వసతుల కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని సూచించారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందిస్తూ, అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, పోలీసు అధికారులు, హైడ్రా అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కట్టుకథలతో ఆరోపణలు చేయడమే హరీశ్‌రావు పని



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పరోక్షంగా ఆ రాష్ట్ర ప్రాజెక్టులకు మద్దతిచ్చిందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

"బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు. అధికారం కోల్పోవడంతో హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారు. ఏపీకి అమ్ముడుపోయి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు. కట్టుకథలతో ఆరోపణలు చేయడమే ఆయన పని. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని ఏపీ ప్రతిసారి కోరుతూ వచ్చింది. అనుమతులు వచ్చాక కూడా సమీక్షించాలని ప్రస్తావిస్తూనే ఉంది. నీటి పంపిణీ కోసం ఒప్పందం లేదా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆనాడు బీఆర్ఎస్ కోరింది. ఇప్పటి వరకు ట్రైబ్యునల్ ఏర్పడకుండా సమయస్ఫూర్తితో అడ్డుకున్నాం.సమ్మక్క సాగర్ విషయంలో ఛత్తీస్‌గఢ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం సంప్రదింపులు జరపలేదు. ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ కోసం మేం ప్రయత్నిస్తున్నాం.. నెలాఖరులో ఇస్తామన్నారు. ఏపీ అభ్యంతరాలను తిప్పికొట్టి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులు సాధించాం. పోలవరం-బనకచర్ల ప్రతిపాదనపైనా వెంటనే స్పందించాం. నీటి హక్కులను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. కాళేశ్వరం నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయి. ఈ విషయంలో కవిత చేసిన ఆరోపణలకు హరీశ్‌రావు జవాబు చెప్పాలి. ఏపీ కాంట్రాక్టర్ల నుంచి అందిన ముడుపుల్లో ఆయన వాటా ఎంత?" అని ఉత్తమ్ ప్రశ్నించారు.

# అంకితభావం... సీనియారిటీకే పెద్దపీట

**నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లపై దృష్టి**

**జిల్లాల నేతలతో ఇన్‌ఛార్జి మంత్రుల సమీక్షలు**

**హైదరాబాద్ పెన్ పవర్:** నామినేటెడ్, పార్టీ కమిటీల పదవులు, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఇన్‌ఛార్జి మంత్రులు ఆరా తీస్తున్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక నేతలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి కనీసం ఏడేళ్లుగా అంకితభావంతో సేవలు అందిస్తున్న సీనియర్ నేతలకు నామినేటెడ్ పదవుల్లో 60% ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ప్రధానంగా 2018 నుంచి 2023 వరకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ తరఫున మండల, జిల్లా స్థాయుల్లో కష్టపడి పనిచేసిన స్థానిక నేతల వివరాలను అసెంబ్లీ నియోజకవర్గం వారీగా సేకరించాలని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి సూచించారు. ఈ మేరకు అర్హులైన స్థానిక నేతల వివరాలను ఇన్‌ఛార్జి మంత్రులు సేకరిస్తున్నారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల నుంచి చేరిన వారికి కాకుండా అంతకుముందు కనీసం ఐదేళ్లపాటు కాంగ్రెస్ కోసం కష్టపడి పనిచేసినవారి బయోడేటాలనే ప్రధానంగా తీసుకుంటున్నారు. ఇప్పటికే తుంగతుర్తి, ఆసిఫాబాద్ వంటి నియోజకవర్గాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవుల భర్తీపై వివాదాలు తలెత్తినందున ఇకపై అలాంటి సమస్యలు రాకుండా పాతతరం నేతలకే 60% ఇవ్వాలని ఏఐసీసీ ఆదేశించింది. ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి మూడు మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులను ఎలా ఇస్తారని తుంగతుర్తి నియోజకవర్గంలో నేతలు గొడవలకు దిగడంతో ఏఐసీసీ పలు సూచనలు ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**సహకార సంఘాల పాలకవర్గాలకు...**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పాలకవర్గాల్లో ఛైర్మన్లు, డైరెక్టర్ పదవులకు మండలాల వారీగా పార్టీ విధేయుల పేర్లను పంపాలని మంత్రులు సూచించారు. బుధవారం



హైదరాబాద్‌లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర్ రాజనర్సింహ ఆయాజిల్లాల నేతలతో సమీక్షలు నిర్వహించారు. త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి ఐదేసి పేర్లు చర్చకు రాగా పొంగులేటి రాసుకొని పార్టీ పెద్దల ముందుంచి సర్వే నివేదికలను జోడించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వంపై రాజకీయ ప్రత్యర్థుల విమర్శలు, ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టాలని నిర్ణయించినట్లు ఓ ఎమ్మెల్యే వివరించారు. హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లోద

జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం స్థానిక నేతల నుంచి లిఖితపూర్వకంగా అభిప్రాయాలను సేకరిస్తున్నారు. సమర్థులైన అభ్యర్థుల ఎంపికలో స్థానిక నాయకుల అభిప్రాయాలకు ప్రాధాన్యముంటుందని చెప్పారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై దృష్టిసారించాలని మంత్రులు నేతలకు సూచించారు.

# సమస్యల పరిష్కారమే ప్రజాప్రభుత్వ ధ్యేయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజాప్రభుత్వ ధ్యేయమని, వారు ఇచ్చే ప్రతి వినతిపత్రంపై బాధ్యతగా స్పందించి న్యాయం చేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారితో మాట్లాడారు. సమస్యల స్వభావాన్ని తెలుసుకుంటూ సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. ధరణి అమలులో అక్రమాల కారణంగా తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని, పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులు జరిగాయని పలువురు బాధితులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పలువురు కోరగా, పోలీసు నియామకాల్లో వయోపరిమితి పెంచాలని యువత విన్నవించింది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలతో నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తివేయాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 200 పైన అర్జీలు వచ్చాయని మంత్రి తెలిపారు.

# శ్రీశైలంలోకి 2.43 లక్షల క్యూసెక్కులు

## ఇదే ప్రవాహం కొనసాగితే నాలుగు రోజుల్లో గేట్లు ఎత్తే అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం, తుంగభద్ర జలాశయాల్లోకి భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా బుధవారం సాయంత్రం శ్రీశైలంలోకి 2.43లక్షల క్యూసెక్కుల వరద రికార్డయింది. నీటిమట్టం 867 అడుగులకు చేరడంతో పాటు నీటినిల్వ 130 టీఎంసీలుగా ఉంది. ఇదే ప్రవాహం మరో నాలుగు రోజులు కొనసాగితే శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశముంది. ఎగువన ఆలమట్టిలోకి వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. అక్కడ లక్షా 35 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. లక్షా యాభైవేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపుర్ నుంచి లక్షా 45 వేల క్యూసెక్కులు వదులుతుండగా.. మధ్యలో కురిసిన వర్షాలు, భీమా నుంచి వచ్చే నీటితో కలిపి జూరాలకు 2.52 లక్షల క్యూసెక్కుల వరద ఉంది. 2.49 లక్షల క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు కూడా భారీ వరద కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. 60 టీఎంసీల నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బంది లేనట్లే. ఇదే ప్రవాహం మరో నాలుగు రోజులు కొనసాగితే తుంగభద్ర గేట్లెత్తి శ్రీశైలానికి విడుదల చేసే అవకాశం ఉంది. మొత్తంమీద కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల పరిస్థితి ఆశాజనకంగా ఉంది.

**శ్రీరామసాగర్‌లోకి 28వేల క్యూసెక్కులు..**

ఉదయం 30 వేల క్యూసెక్కుల వరద రాగా, మధ్యాహ్నానికి 28 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుత నీటినిల్వ 37 టీఎంసీలు. మరో 43.5 టీఎంసీలు వస్తే నిండుతుంది. స్థానికంగా కురిసిన వర్షాలతోనే ఈ ప్రవాహం వచ్చింది. ఇక నిజాంసాగర్‌లోకి 8,900 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, నీటి నిల్వ పది టీఎంసీలకు చేరింది. కడెంలోకి 4,300, ఎల్లంపల్లిలోకి 2,600 క్యూసెక్కులు రాగా, ఎల్లంపల్లి నుంచి నంది పంపుహౌస్ ద్వారా మధ్య మానేరుకు నీటి విడుదల కొనసాగుతోంది. మధ్యమానేరుకు 14,500 క్యూసెక్కులు రాగా, నీటినిల్వ 17 టీఎంసీలుగా ఉంది. నిండటానికి మరో పది టీఎంసీలు అవసరం. ప్రాణహిత నుంచి వచ్చే నీటితో కలిపి లక్ష క్యూసెక్కులను మేడిగడ్డ నుంచి దిగువకు వదలుతున్నారు.

**ప్రాజెక్టులపై సమావేశం నేడు...**

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను పరిగణనలోకి తీసుకొని వినియోగంపై నిర్ణయం తీసుకోవడానికి బుధవారం జరగాల్సిన రాష్ట్ర స్థాయి చీఫ్ ఇంజినీర్ల కమిటీ సమావేశం గురువారానికి వాయిదా పడింది. దిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రిని కలిసేందుకు ముఖ్యమంత్రి, మంత్రితోపాటు నీటిపారుదల శాఖ కార్యదర్శి, కొందరు చీఫ్ ఇంజినీర్లు వెళ్లాల్సి రావడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# జీవోలను అమలు చేయాలని కోర్టులు చెప్పగలవా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ విధానాలకు సంబంధించి జారీ చేసిన జీవోలను అమలు చేయాలని కోర్టులు చెప్పగలవా అంటూ ఎమ్మెల్యేలు టి.హరీశ్‌రావు, పాయల్ శంకర్‌లను బుధవారం హైకోర్టు ప్రశ్నించింది. కార్యనిర్వాహక ఉత్తర్వులను అమలు చేయాలన్న ఆదేశాలను న్యాయవ్యవస్థ జారీ చేయగలదా అన్న ప్రశ్న తలెత్తుతోందని వ్యాఖ్యానించింది. రుణమాఫీని, ఇన్‌పుట్ సబ్సిడీని అమలు చేయాలని కోరుతూ భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు, భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వాటిపై రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది జె.రామచంద్రరావు తదితరులు వాదనలు వినిపించారు. "రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల మంది రైతు కుటుంబాలు ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హమైనప్పటికీ కేవలం 10 వేల కుటుంబాలకే చెల్లింపులు జరిగాయి. చట్టాలు లేకుండా జీవోలు అమల్లో ఉన్నపుడు అవి కూడా చట్టాలే. వాటిని అమలు చేయాలని కార్యనిర్వాహక వ్యవస్థకు ఆదేశాలు జారీ చేయవచ్చు. 300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు" అని ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ కార్యనిర్వాహక ఉత్తర్వులను అమలు చేయాలని తామెలా చెప్పగలమని ధర్మాసనం ప్రశ్నించింది. 'పరిపాలనా అనుమతులు మంజూరయ్యాక ప్రభుత్వం వద్ద ఉన్న వనరుల ఆధారంగా విడతల వారీగా నిధుల విడుదల చేయవచ్చు. ఆర్థిక పరిస్థితిని తెలుసుకోకుండా ఫలానా దానికి రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని మేమెలా చెప్పగలం? ఒకసారి ఇలా ఆదేశాలిస్తే ప్రతి ఒక్క శాఖకు సంబంధించి నిధులు విడుదల చేయాలని ఆదేశించాలంటూ ఇలాంటి పిటిషన్‌లు దాఖలయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ విధానాల అమలు కోసం ఎమ్మెల్యే హోదాలో ఉన్న వ్యక్తులు అసెంబ్లీ లేదంటే ప్రజావేదికల్లో ఎందుకు చర్చించరు? కోర్టులను ఆశ్రయించడమేమిటి? బలహీనవర్గాలు, ప్రశ్నించలేని బడుగుల కోసం ప్రజాప్రయోజన వ్యాజ్యాలున్నాయి. అయితే బలవంతులే వాటిని ఎక్కువగా వేస్తున్నారు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషన్‌ల విచారణార్హతకు సంబంధించి ఈనెల 14న నిర్ణయం వెలువరిస్తామంటూ విచారణను వాయిదా వేసింది.

# హైదరాబాద్‌లో దాదాపు 10 లక్షల ఓట్లు ఓటర్ల లిస్ట్ నుంచి ఔట్ !

-3 పేజి తరువాయి

జూబ్లీ హిల్స్ 88 వేల 933 ఓటర్లు, ముషీరాబాద్ 84 వేల 917 ఓటర్లు, యాకుత్‌పురా 84 వేల 792 ఓటర్లు, చాంద్రాయణగుట్ట 81 వేల 500 ఓటర్లు లెక్క తేలారు. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 9.95 లక్షల ఓటర్లను ఆబ్సెంట్, షిఫ్టెడ్ రాతీ డెడ్ ఓటర్లుగా గుర్తించినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి ఆర్.వి. కర్ణన్ చెప్పారు. బుధవారం ఈ గణాంకాలను విడుదల చేశారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 88 వేల 933 మంది ఏఎస్డీ ఓటర్లు అత్యధికంగా నమోదు కాగా, అంబర్‌పేట్‌లో అత్యల్పంగా 38 వేల 208 మంది ఓటర్లు నమోదయ్యారు. ఆగస్టు 5 నాటి జనాభా గణన పత్రాల డిజిటలైజేషన్ రిపోర్ట్ ప్రకారం.. హైదరాబాద్ జిల్లాలో 57.56 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. మొత్తం 47 లక్షల 36 వేల 669 మంది ఓటర్లలో.. 27 లక్షల 26 వేల 665 మంది ఓటర్లకు డిజిటలైజేషన్ పూర్తయింది. రెండు చోట్ల ఓట్లు నమోదు చేసుకున్న వాళ్లు ఒక్క చోటుకే పరిమితం కావడం, ఉపాధి, వివాహాలు, ఇతర కారణాల వల్ల శాశ్వతంగా నివాసాలు మారడం, చనిపోయిన వారి పేర్లను తొలగించడం, సరైన పత్రాలు సమర్పించకపోవడం వంటి కారణాలతో ఈ ఓటర్లను అన్ కలెక్టబుల్ ఎన్యుమరేషన్ దరఖాస్తుల కింద నమోదు చేస్తున్నారు.

# గిరిజన గురుకులంలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**వికారాబాద్: పెన్ పవర్:** కుల్కచర్ల మండలం బండవెల్కి చర్ల గిరిజన గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి తారక్ తేజ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసాడు. పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించి హుటాహుటిన కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థి సిక్ రూమ్లో తారక్ తేజ్ కు చెందిన పుస్తకాలు, ప్లేటు, సామాగ్రిని తోటి విద్యార్థులు బయటకు విసిరేసి పలుమార్లు ఇబ్బందులకు గురిచేసినట్లు సమాచారం.

ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేస్తే వారు కూడా ఇబ్బందులకు గురి చేసిన విద్యార్థులకు సపోర్టు చేయడంతో మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కొడుకు ఆత్మహత్యకు ప్రధానోపాధ్యాయుడే ( ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్ రెడ్డి) కారణమంటూ ఆరోపించారు. తమ కొడుకు ఆత్మహత్య చేసుకున్న సమాచారం ఇవ్వకపోవడం తో కుల్కచర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడు ప్రిన్సిపల్ సమాచారం ఇచ్చారని అన్నారు. విద్యార్థి స్వస్థలం షాద్నగర్ మండలం కుల్చర్ల తండాకు చెందినవాడు.

# జాతీయ అవయవ దాన దినోత్సవం అవయవ దానంపై అవగాహన, ప్రతిజ్ఞ

**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:** జాతీయ అవయవ దాన దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు మూడో తారీఖున ప్రభుత్వ వైద్య కళాశాల జయశంకర్ భూపాల్ పల్లిలో అనేక పోటీలు నిర్వహించారు. ఆగస్టు 5 తారీఖున అవయవ , శరీర మరియు నేత్రదాన అవగాహన కార్యక్రమం జరిగింది.

అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అవయవ దానం చేసే పరిస్థితిలో ఉండాలి కానీ అవయవ దానం అందుకునే లిస్టులో మన పేరు ఉండేలా చేసుకోవద్దని , మన దేహాన్ని అందులో అవయవాల్ని సరైన నడవడికతో,సరైన ఆహారంతో మనమే కాపాడుకోవాలని అంతేకాకుండా సమయం దొరికినప్పుడు వైద్య విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొంటూ సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

నేత్ర వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజా భరత్ కుమార్ నేత్రదానం విశేషతను అందులో ఉన్న అపోహలను దూరం చేసేలా సందేశం ఇచ్చారు. తెలంగాణ కంటి చర్మ నేత్ర దేహ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ లింగం మాట్లాడుతూ అవయవ దానం మరియు దేహదానం గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చైతన్యం తెప్పించారు.

చివరగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేష్ కార్యక్రమాన్ని అధ్యక్షత వహించి అవయవ దాన ప్రతిజ్ఞను అందరితో చేయించారు. అందరిని అవయవదానం ఉద్యమంలో పాల్గొనాలి అని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆనాటమీ విభాగం నుండి డాక్టర్ అజయ్ ప్రకాష్, తెలంగాణ కంటి చర్మ నేత్ర దేహ దాతల సంఘం నుండి మల్లారెడ్డి గారు, భూపాలపల్లి జిల్లా సభ్యులు చంద్రమౌళి, రాజు మరియు ప్రెసిడెంట్ భూమయ్య పాల్గొన్నారు

# మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:** ప్రజల సమస్యల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరిస్తూ ఉత్తర్వులు (+.నా.వీం.చీశీ.4, తేదీ: 04.08.2026) జారీ చేసింది. ప్రతి వారం సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (వీూణూ) కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది.

నోడల్ అధికారి: ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ (వీూణూ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.

అధికారుల హాజరు: తహసీల్దార్, ఎంపీఓ, మండల వ్యవసాయ అధికారి, ఎంఈఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, పోలీస్ మరియు ఇతర మండల స్థాయి శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, వెంటనే చర్యలు చేపడతారు.

డిజిటల్ నమోదు (గ్రీఖుయిఖుబుఅఖ ాశీశ్రీుశ్రీ): మండల స్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదును ఏకీకృత 'ప్రజావాణి పోర్టల్'లో నమోదు చేసి, ఫిర్యాదుదారునికి గ్రీవెన్స్ ఐడీ (+తీఱవఖుఅవ ×ఱ) తో కూడిన రసీదును అందిస్తారు.

ప్రాధాన్యత ఓ సౌకర్యాలు: వికలాంగులు, వయోవృద్ధులు, గర్భిణులు మరియు బాలింతలకు అర్జీల సమర్పణలో మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

మంచినీరు, కూర్చోవడానికి సీటింగ్, హెల్ప్‌డెస్క్ వంటి ప్రాథమిక సౌకర్యాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244

## జూరాలకు భారీగా పోటెత్తిన వరద

## 33 గేట్లు ఎత్తివేత

**మహబూబ్ నగర్: పెన్ పవర్:** కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుంది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు మహబూబ్ నగర్ జిల్లా జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది, దీంతో ప్రాజెక్టు కు 02 లక్షల 44 వేల క్యూసెక్కుల వరద నీళ్లు చేరుతుండడంతో అధికారులు ప్రాజెక్టు 33 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు శ్రీశైలం ప్రాజెక్టుకు 02 లక్షల 49 వేల 387 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో: 02 లక్ష ల 44 వేల క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో: 02 లక్షల 49 వేల 387 క్యూసెక్కులు గా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516. మీటర్లు ప్రస్తుత నీటిమట్టం..317.370 మీటర్లు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు. ప్రస్తుత నీటి సామర్థ్యం 7.707 టీఎంసీలు. ఎగువ, దిగువ జలవిధ్యుత్ కేంద్రలలో 11 యూనిట్ల లో434 మెగా వాట్ల విధ్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న లారీ పట్టివేత

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:**
మణుగూరు కొమ్ముగూడెం ప్రాంతం నుంచి వస్తున్న జీరో ఇసుక లారీని పోలీసులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి లారీని పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీసులు తనిఖీలు చేపట్టిన సమయంలో డ్రైవర్ పరారైనట్లు సమాచారం. ఈ లారీ అశ్వాపురం మండలానికి చెందిన వ్యక్తిదిగా పోలీసులు అనుమానిస్తూ, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## భూ పరిహార చెల్లింపులో జాప్యం

## ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశం

**వికారాబాద్: పెన్ పవర్:** వికారాబాద్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ పరిహార వివాదం సంచలన మలుపు తిరిగింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ రైతుకు చెల్లించాల్సిన పరిహారం ఇప్పటికీ అందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వికారాబాద్ సీనియర్ సివిల్ కోర్టు... ఏకంగా ఆర్డీవో కార్యాలయంలోని కదిలే ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించింది. కోర్టు బెలిఫ్ కార్యాలయానికి చేరుకుని జప్తు ప్రక్రియ చేపట్టగా, అనంతరం రెండు నెలల్లో రూ.61.29 లక్షల పరిహారం చెల్లిస్తామని అధికారులు రాతపూర్వక హామీ ఇవ్వడంతో జప్తు చేసిన వస్తువులను తిరిగి కార్యాలయ కస్టడీకే అప్పగించారు. 1986–87లో రైల్వే ప్రాజెక్టు కోసం రైతు శశాంక్ రెడ్డికి చెందిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, అప్పట్లో గజానికి కేవలం రూ.50 మాత్రమే పరిహారం నిర్ణయించారు. దీనిపై కోర్టును ఆశ్రయించిన రైతు... జిల్లా కోర్టు నుంచి హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసి చివరకు గజానికి రూ.125 చొప్పున పరిహారం పొందే హక్కును సాధించుకున్నారు. అయినప్పటికీ పరిహారం చెల్లింపులో జాప్యం కొనసాగడంతో కోర్టు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న ఈ భూ పరిహార పోరాటం ఇప్పుడు జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## కల్తీ రాయుళ్లపై పీడీ యాక్ట్ పెట్టాలి ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ మసాలాల కల్తీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులకు గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ అభినందనలు తెలిపారు. కల్తీ రాయుళ్లపై పోలీసులు నమోదు చేస్తున్న చట్టపరమైన సెక్షన్ల వెంటనే మార్చాలని రాజా సింగ్ డిమాండ్ చేశారు. బలహీనమైన సెక్షన్ల వల్ల నిందితులు సులభంగా స్టేషన్ బెయిల్పై బయటకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ నేరస్తులపై కఠినమైన 'పీడీ యాక్ట్' ప్రయోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు కల్తీ రాయుళ్ల సమగ్ర వివరాలను బహిరంగంగా వెల్లడించాలని సూచించారు.

## తెలంగాణలో 60 లక్షల ఓట్లు కట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంతవరకు తెలంగాణలో ఆరవై లక్షల ఓట్లు కట్ అయ్యాయి. సర్ ప్రక్రియ పూర్తయ్యే అనంతరం 60 లక్షల ఓటర్ల సంఖ్య తగ్గవచ్చని అధికారుల అంచనా. దాదాపు 40 లక్షల మంది ఓటర్లు జాబితాలోని అడ్రస్లో అందుబాటులో లేరని అధికారులు గుర్తించారు. చనిపోయిన వారు, తెలంగాణలో ఓటున్న పక్క రాష్ట్రాల వారు, రెండు, మూడు ఓట్లున్న వారు మరో 20 లక్షల మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. దీంతో మొత్తం 60 లక్షల ఓట్లు తొలగించే అవకాశముంది.

## ఘనంగా బోనాల వేడుకలు కళాకారులతో కలిసి పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ ఆగస్టు 5: పెన్ పవర్:** కరీంనగర్ నగరంలోని కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మేయర్, నగర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పేర్కొంటూ, కళాకారులు ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన నిర్వాహకులు, కళాకారులు, పోలీసులు, మున్సిపల్ సిబ్బందిని అభినందించిన మేయర్, కార్యక్రమంలో మహిళలు, భక్తులు, ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టేడియం నుంచి 2 నుంచి 3 కోట్ల లీటర్లు

**హైదరాబాద్, ఆగస్టు 5 పెన్ పవర్:**
హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి తెలిపింది. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రతి ఏడాది 2 నుంచి 3 కోట్ల లీటర్ల వరకు వర్షపు నీటిని సేకరించి వినియోగించే అవకాశం ఉందని వెల్లడించింది. పిచ్ నిర్వహణ కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్నారంటూ దాఖలైన కేసులో భాగంగా హెచ్‌సీఏ జూలై 2న ఎన్‌జీటీకి స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కొత్త రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఫిల్ట్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని, అప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ట్రైబ్యునల్‌ను కోరింది. హెచ్‌సీఏ పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం.. స్టేడియంలో పడే వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసి మైదానం నిర్వహణ, తోటల సాగు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. అదనంగా భూగర్భ జలాలను రీచార్జ్ చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్టేడియాన్ని వాటర్ పాజిటివ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది. వర్షపు నీటితో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మైదానం, పచ్చదనం నిర్వహణ కోసం వినియోగించే అవకాశాలను కూడా హెచ్‌సీఏ పరిశీలిస్తోంది. దీంతో భూగర్భ జలాల వినియోగం మరింత తగ్గుతుందని పేర్కొంది. ప్రస్తుతం ఉప్పల్ స్టేడియంలో మొత్తం 8.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. గేట్ నంబర్–5 సమీపంలో 3.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ట్యాంకు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తుండగా, 2.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకును అగ్నిమాపక అత్యవసర అవసరాల కోసం కేటాయించారు. గేట్ నంబర్–3 వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారు. హైదర్ అలీ అనే వ్యక్తి ఎన్‌జీటీలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. క్రికెట్ మైదానాల నిర్వహణ కోసం భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని, బదులుగా శుద్ధి చేసిన నీరు లేదా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ఐపీఎల్ వంటి వాణిజ్య టోర్నీల సమయంలో కూడా భారీగా నీరు వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కేసులో 2021 నుంచే ఎన్‌జీటీ విచారణ కొనసాగుతోంది. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా హెచ్‌సీఏ సమయానికి స్టేటస్ రిపోర్ట్ సమర్పించకపోవడంతో ఈ ఏడాది జనవరిలో ట్రైబ్యునల్ రూ.5 వేల జరిమానా విధించింది. అనంతరం హెచ్‌సీఏ జరిమానా చెల్లించి, సాంకేతిక వివరాలు సేకరించడం, నిపుణుల సలహాలు తీసుకోవడం వల్లే ఆలస్యమైందని వివరణ ఇచ్చింది

# రేవంత్ ధీమా వెనుక...

**మహబూబ్ నగర్, ఆగస్టు 5, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ఒక మలుపు. అప్పటి వరకు పలువురు విశ్లేషకులు, రాజకీయ వర్గాలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేసినట్లు చూశారు. అయితే ఆ అంచనాలన్నీ తలకిందులైపోయాయి. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో మూడు పర్యాయాలు అధికారం కొనసాగుతుందనే ధీమాతో ముందుకు సాగుతోంది. 2018 నుంచి 2023 మధ్య కాలంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ పెరుగుతున్న బలం స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అక్కడక్కడా కనిపించకపోవడంతో, అసలు పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే జరుగుతుందని చాలామంది భావించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా బీజేపీని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రాజకీయ వ్యూహాలు రచించారు. ఓట్లు చీలిపోతే మూడోసారి అధికారం సాధ్యమవుతుందని గులాబీ పార్టీ నాయకులు అంచనా వేశారు. అయితే జరిగింది వేరే. బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి ఓట్లు అన్నీ ఒకే చోటకు కేంద్రీకృతమయ్యాయి. ఆ ఫలితం కాంగ్రెస్‌కు దక్కింది. ఇక్కడ రేవంత్‌రెడ్డి పాత్ర కీలకమైంది. కేసీఆర్‌కు నిజమైన ప్రత్యామ్నాయం తానేనని స్పష్టంగా చాటుకున్నారు. పార్టీలోని అనేక అగ్ర నేతలను సమన్వయం చేసుకుని, ఏకగ్రీవ నాయకత్వం ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. ఫలితంగా ప్రజల్లో విశ్వాసం పెరిగి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గడచిన 30 నెలలుగా ఆయన తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ, పార్టీ సమావేశాల్లోనూ కాంగ్రెస్ మరో మూడు పర్యాయాలు గెలుస్తుందని స్పష్టంగా చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో కూడా 2034 వరకు తానే ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇది కేవలం కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం మాత్రమే కాదు. దీని వెనుక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో సాధారణంగా వర్గపోరులు పార్టీని బలహీనపరుస్తాయి. అయితే ఏక నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ అద్భుతాలు సృష్టించగలదని గత చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఆ లోటును తీరుస్తున్నారని రాజకీయ



వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ బలం మరింతగా పెరుగుతోంది. దేశవ్యాప్తంగా బీజేపీపై అసంతృప్తి మెల్లగా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితిని సృష్టిస్తోంది. ఇండియా కూటమిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, 2029లో కేంద్రంలో అధికారం సాధించగలమని నమ్మకంతో ఉంది. దక్షిణ భారతదేశంలోనే కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ, కర్ణాటక, కేరళల్లో అధికారంలో ఉండటం, తమిళనాడులో భాగస్వామ్యం ఇలాంటి అంశాలు ఆ పార్టీకి బలం చేకూరుస్తున్నాయి. యువతలో కూడా కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, వారు జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకోవచ్చని రేవంత్ అంచనా వేస్తున్నారు. ఈ జాతీయ పరిణామాలు తెలంగాణలోని స్థానిక రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతాయి. 2028 ఎన్నికల నాటికి ఈ పరిస్థితులు మరింత బలపడితే, కాంగ్రెస్‌కు మరోసారి విజయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం. కాంగ్రెస్ బలం పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలిచిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంగా ఉండి తన స్థానాన్ని కాపాడుకోవాల్సిన సవాలు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌లో ఏక నాయకత్వం కొనసాగితే, ప్రాంతీయ పార్టీలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పునరాగమనం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. బలమైన నాయకత్వం, జాతీయ పరిస్థితులు, యువత ఆకాంక్షలు కలిసి ఒక కొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చెబుతున్న మూడు టర్ముల లక్ష్యం నిజమవుతుందా లేదా అనేది కాలం నిర్ణయిస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.

# సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి, ముసారాంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అఆజారుద్దీన్

**హైదరాబాద్ పెన్ పవర్:**
బుధవారం నాడు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్, ముసారాంబాగ్ బ్రిడ్జ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్ లో ఉండి 680 కోట్ల రూపాయలతో పూర్తి చేసుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి పనులు చంచల్ గూడా జైలు నుండి ఒవైసీ హాస్పిటల్ వరకు, చంపాపేట కి మరో లైన్ తో పూర్తి చేసుకుంది. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం జరుగుతుంది. సంతోష్ నగర్, చంచల్ గూడ జైలు, సైదాబాద్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్కువ సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేలా ఈ బ్రిడ్జి ఉపయోగపడుతుందని అన్నారు.
సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి తో పాటు మూసారాంబాగ్ బ్రిడ్జి తర్వలోనే ప్రారంభం చేసుకొని ప్రజలకు ఉపయోగంలోకి వస్తుంది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ బ్రిడ్జి సౌకర్యం ఉంటుంది. దీనికి అప్రోచ్ రోడ్డు విస్తరణ చేయాలి పెండింగ్ లో ఉన్న ఈ బ్రిడ్జి లను ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నగరంలో పెరుగుతున్న జనాభా కి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుంది. కేబీఆర్ పార్క్ వద్ద బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగిస్తున్నాం. ట్రాఫిక్ ప్రజా సేవల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.



బోనాలెత్తిన మహిళలు

# భక్తి పారవశ్యంలో ముత్యాలమ్మ బోనాల మహోత్సవం


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


తొలి బోనం సమర్పణలో పాల్గొన్న సర్పంచ్ బానోత్ పార్వతి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 5:**గార్ల మండల కేంద్రంలో ఆరాధ్య దైవాలుగా వెలసిన దండు ముత్యాలమ్మ ఊరు ముత్యాలమ్మ బోనాలఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి అధిక శ్రావణమాసంఅసలేరు కార్తెలో భక్తుల కొంగుబంగారాలుగా విరాజిల్లుతున్న దండు ముత్యాలమ్మ ఊరు ముత్యాలమ్మ దేవాలయాలలో కుమ్మరి సంఘం గౌడ సంఘం చాకలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం బోనాల వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు బోనాల ఉత్సవాలలో భాగంగా తొలుత మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతీ హతిరాం ఉప సర్పంచ్ మహమ్మద్ జరీనా లు హాజరై గౌడ సంఘం కుమ్మరి సంఘం కుల పెద్దల తో కలిసి ఊరేగింపుగా గ్రామంలోని గడి మైసమ్మ గణాచారి బుచ్చమ్మ శీతల పరమేశ్వరి బొడ్రాయి నాభిశిల గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించి నైవేద్యాన్ని నివేదించి మొక్కులు చెల్లించారు ఉదయం నుండి అమ్మవార్లకు బోనాలు సమర్పించేందుకు దేవాలయానికి మహిళలు భక్తులు బారులు తీరడంతో దేవాలయం ప్రాంగణం మొత్తం సందడి నెలకొంది కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా అనవాయతిగా ముత్యాలమ్మ తల్లులకు సమర్పించే తొలి ఊరు బోనం కుమ్మరి కులస్తులు ఎత్తుకొని డీజే డప్పుచప్పుళ్ల నడుమ భక్తి పారవశ్యంలో శివసత్తుల పూనకాలు నృత్యాలతో ఉత్సవంగా పట్టణ పురవీధుల గుండా పెద్ద ఎత్తున మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ముత్యాలమ్మ దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి పసుపు కుంకుమ చీర సారెతో పాటుగా నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు వర్షాకాలంలో సంభవించే వ్యాధులు ప్రబలకుండా పట్టణ ప్రజలను సుఖశాంతులతో వెలుగొందాలని అమ్మవారిని సర్పంచ్ పార్వతి హతి రామ్ నాయక్ అమ్మవారిని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో ఇల్లందు పిఎసిఎస్ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు షేక్ యాకుబ్ పాషా మహమ్మద్ రహీమ్ ఖాన్ వార్డు సభ్యులు పూర్ణచందర్ సాయి నీలమ్మ దీపిక ఇమ్రాన్ శ్రీలక్ష్మి రావూజికుమ్మరి కులస్తులు రవీందర్ నాగేశ్వరరావు మల్లయ్య కుమారస్వామి హరి మల్లేష్ రామారావు మహేష్ తాళ్లూరి కొండలరావు లక్ష్మీ లాలమ్మ నాగమ్మ గౌడ కులస్తులు ఈశ్వర్ లింగం తోడేటి శ్రీనివాస్ తాళ్ల పెల్లి కృష్ణ మండ రవి తోడేటి విజయ రాముడు దుర్గా రాము సతీష్ మహేష్ కత్తి శివ కొత్త కొండ కుమార్ తోడేటి కోటేష్ రాజు రాజేష్ భక్తులు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# దోమలమయం రోగాల భయం







- పగలు రాత్రి తేడా లేకుండా దోమల విజృంభణతో ప్రజలు బెంబేలు
- పారిశుద్ధ్య లోపం మురుగు నీరే కారణం
- నివారణ చర్యలు శూన్యం రోగాల బారిన పడుతున్న ప్రజలు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 5:** గార్ల మండల కేంద్రంలో దోమల బెడద ఎక్కువగా ఉంది. పగలు, రాత్రి అని లేకుండా స్వైర విహారం చేస్తూ.. జలగల్లా పట్టిపీడిస్తూ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి పారిశుద్ధ్య లోపం డ్రైనేజీ వ్యవస్థ అద్వానంగా ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి దీంతో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది స్థానిక తాసిల్దార్ బజార్ జెండా బజార్ బెస్త బజార్ రాతి స్తంభం బజార్ ముస్లిం బజార్ లలో కాలువలలో మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు ఎక్కడికక్కడే ఆగిపోయి నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసాలుగా మారి దోమకాటుతో మలేరియా టైఫాయిడ్ జ్వరాలు వచ్చే సూచన ఉన్నా అధికారులు ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కనిపించని ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

గతంలో వర్షాకాలం రాకముందే ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామపంచాయతీ అధికారులు వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ పరిసరాలను, నీటి నిల్వ గుంతలను పరిశీలించి ఉపయోగంలో లేని వస్తువులలో నీటి నిల్వలను తొలగించి, తేమోపాస్ ద్రావణం పిచికారీ చేయించి పారిశుద్ధ కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫినాయిల్, మలాథీన్లతో స్ప్రే తో పాటుగా ఫాగింగ్ చేయించిపారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించేవారు

ఇప్పుడు కనీసం కన్నెత్తి చూడడం లేదు కదా దోమలను నివారించడానికి శానిటేషన్ పనులు చేయించాల్సిన ప్రజా ప్రతినిధులు అధికారులు చోద్యం చూస్తున్నారు దీంతో దోమల నివారణకు ఇళ్లలో కాయిల్స్ లిక్విడ్ సీసాల వినియోగానికి ప్రతి కుటుంబం నెలకు 500 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది

### పత్తాలేని ఫాగింగ్

పారిశుధ్యం పై సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో డ్రైనేజీలు దోమలకు నిలయాలుగా మారి పలు వ్యాధులు ప్రబలుతుండడంతో పిల్లలు వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడం కాలువలలో బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడంతో అపరిశుభ్రత రాజ్యమేలుతూ విష జ్వరాల బారిన పడుతున్నారు దోమల నివారణకు కచ్చితంగా ప్రతినిత్యం ఫాగింగ్ చేయించాలి ఫాగింగ్ చేయించకపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి ఫాగింగ్ సక్రమంగా చేస్తే దోమలు తగ్గే అవకాశం ఉంది.



### వర్షాకాలం వచ్చిందంటే హడల్

వర్షాకాలం వచ్చిందంటే మలేరియా డెంగ్యూ వైరల్ జ్వరాలతో పాటు సాధారణ జ్వరాలు విజృంభిస్తాయి ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నా ప్రతి ఏటా వందల సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయి కానీ ఇంతవరకు అధికారులు నివారణ చర్యలు చేపట్టకపోవడంతో ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాలను దోమలు స్థిర నివాసాలుగా ఏర్పడి దోమల సంతతి వృద్ధి పెరగడంతో రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు విష జ్వరాలు డెంగీ మలేరియా కేసులు పెద్ద సంఖ్యలో కేసులు నమోదైతే భారీ మూల్యం చెల్లించక తప్పదు

### నివారణ చర్యలు చేపట్టాలి

లార్వాదశలోనే దశలోనే దోమల నివారణకు చర్యలు చేపట్టి దోమల నివారణ మందులు మురికి గుంతలో పిచికారి చేయాలి ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల మందు పొగ పెట్టాలి నీటి నిల్వల్లో దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు చేపట్టాలి. రాత్రి వేళల్లో కంటికి కునుకులేకుండా చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ కుడితే దద్దుర్లు వచ్చి ఒళ్లంతా దురదలు తగ్గడం లేదని వర్షాకాలం కావడంతో ఏ చిన్న జ్వరం వచ్చినా భయం వేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా సాధికారత పై గ్రామసభ ఏర్పాటు



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ పార్వతి నాయక్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 5:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం లో బుధవారం మహిళా సాధికారత విద్య ఉపాధి ఆర్థిక స్వావలంబనపై సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి మహిళా సాధికారత పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ మాట్లాడుతూమహిళలు విద్య, ఉపాధి, పరిశ్రమ రంగాల్లో సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళా శక్తి సంకల్పిస్తే ఏదైనా సాధించగలదని అన్నారు. మహిళలు విద్య, నైతిక విలువలు, రాజకీయ అవగాహన, స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు సాగినప్పుడే ఆర్థికాభివృద్ధి, సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. మహిళలు సంఘటితంగా ఉండి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసుకోవాలని, స్థానిక సంస్థలు, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని సూచించారు. ఈ గ్రామ సభలో గ్రామ అభివృద్ధి నిధుల వినియోగం ప్రజా సమస్యలపై టీజీఎస్ నాయకులు గిన్నారపు మురళీ తారక రామారావు మాట్లాడుతూగ్రామపంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న నిధుల వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలనిగ్రామపంచాయతీకి ఏఏ పథకాల కింద ఎంత మేర నిధులు మంజూరయ్యాయి, ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు, ఇంకా ఎంత నిల్వలో ఉంది, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను గ్రామసభలోనే ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని వారు కోరారు. గ్రామసభలు కేవలం తూతూ మంత్రంగా కాకుండా ప్రజల ప్రశ్నలకు సమాధానం లభించే వేదికగా ఉండాలన్నారు ప్రజలకు తెలుసుకునే హక్కు ఉందని, ప్రతి రూపాయి ఖర్చు లెక్కలను గ్రామసభలో వెల్లడించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.గ్రామంలో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధిదీపాలు తదితర సమస్యల పై అధికారులను ప్రజాప్రతినిధులను నిలదీయడంతో కార్యదర్శి మధు నాయుడు అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా అందిస్తామని తెలిపారు. గ్రామ సభకు ఐకెపి అధికారులు గైర్హాజరయ్యారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జేరీనా వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్ తాళ్లపల్లి కృష్ణ గౌడ్ సలగం నీలమ్మ సిపిఎం పార్టీ నాయకులు కందునూరి శ్రీనివాస్ ఏఎస్ఐ వెంకట్ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వదినను వేధించిన మరిదిపై కేసు నమోదు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 5:** వదినను వేధిస్తున్న మరిదిపై కేసు నమోదు చేసినట్టు గార్ల ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని చిన్న కిష్టాపురం మంగలి తండా గ్రామానికి చెందిన ఒంటరి మహిళ తన భర్త చనిపోయారు. అప్పటి నుండి మరిది భానోతు వీరన్న వేధింపులకు గురి చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. బాధితురాలు ఈనెల 2వ తేదీన రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని వీరన్న అక్కడికి వచ్చాడు. నేను నీకు అండగా ఉంటాను.. నువ్వు నాకు కావాలి అంటూ వేధింపులకు గురి చేశాడని వివరించారు. దీంతో ఆమె కేకలు వేయడంతో వీరన్న ఇంట్లో నుండి పారిపోయాడని, తనను వేధింపులకు గురి చేస్తున్న వీరన్నపై బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



సమాజంలో మాట్లాడుతున్న గవర్నమెంట్ హాస్పటల్ సూపరింటెండెంట్ నరేందర్

**ఖమ్మం, పెన్ పవర్, ఆగస్టు 5:** డబ్బా పాలు వద్దు.. తల్లి పాలే ముద్దని హెచ్ ఓ డి డాక్టర్ బాబు రత్నాకర్ అన్నారు. ఖమ్మం గవర్నమెంట్ హాస్పిటల్ లో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు అత్యంత ఉపయోగకరంగా నిలుస్తాయని తల్లిపాలను మించిన ఆహారం మరొకటి లేదన్నారు పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టించాలని బాలింతలకు గర్భిణీ స్త్రీలకు సూచించారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటూ భవిష్యత్తులో సంభవించే పలు రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే శక్తి లభిస్తుందని అన్నారు తల్లిపాల విశిష్టతను తెలిపేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు నెల మొదటి వారం రోజులు తల్లిపాల వారోత్సవాలుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. నవజాత శిశువులకు తల్లిపాలు అమృత తుల్యమైనవని ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పౌష్టికాహారం తల్లిపాలేనని సంపూర్ణ ఆరోగ్యంగా పుట్టిన పిల్లలకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం తప్పనిసరి అని ఆయన అవగాహన కల్పించారు అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై నర్సింగ్ కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ నరేంద్ర, ఆర్ ఎం ఓ అనిత గైనకాలజిస్ట్ మాధవి నర్సింగ్ సూపరిండెంట్ రత్నకుమారి, మేరీ రోజా మిల్క్ బ్యాంక్. మేనేజర్ రమ్య సిబ్బంది గవర్నమెంట్ నర్సింగ్ కాలేజ్ పులిపాటి నర్సింగ్ కాలేజ్ కిన్నెర నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధం


సైబర్ క్రైమ్ అవగాహనలో మాట్లాడుతున్న సిఐ రవీందర్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 5:** సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ఆయుధమని గార్ల బయ్యారం సీఐ ఎల్ రవీందర్ అన్నారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా సురక్ష కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ వైపు నినాదంతో మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజు అధ్యక్షతన బుధవారం సైబర్ క్రైమ్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూడిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లురెచ్చిపోతున్నారన్నారని యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్లు, ఆన్లైన్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల వినియోగం విస్తరించడంతో సైబర్ నేరాలకు అవకాశాలు పెరిగాయన్నారు.బ్యాంకు ఖాతా వివరాలు, ఒటీపీ, యూపీఐ పిన్, సీవీవీ సంఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పకూడదని తెలియని లింక్ లను నొక్కకూడదన్నారు. నకిలీ వెబ్సైట్లు, నకిలీ మొబైల్ యాప్లు, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, ఓటీపీలు, యూపీఐ అభ్యర్థనలు, క్యూఆర్ కోడ్ల ద్వారా డబ్బు దోచుకునే కొత్త పద్ధతులు విస్తృతంగా పెరిగాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే బాధితులు వెంటనే టోల్-ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఇది 24 గంటలూ పనిచేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో సైబర్ నేరాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గార్ల ఎస్సై సాయికుమార్ ఏఎస్ఐ వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోలు

**హైదరాబాద్, ఆగస్టు 5 పెన్ పవర్:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుండటంతో ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నాటికి ప్రస్తుతమున్న 26 డిపోల సంఖ్యను 31కి పెంచేందుకు ముషీరాబాద్‌లో హైదరాబాద్-3, నాగారం రోడ్డులో జవహర్‌నగర్ డిపోలతో పాటు మూతబడిన రాణిగంజ్-2 డిపోను పునఃప్రారంభించనున్నారు. స్థల కేటాయింపుపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను కోరారు. నగరంలో ప్రస్తుతం 493 ఈవీ బస్సులు నడుస్తుండగా.. అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం, మరోవైపు నగర శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తుండటంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్ డిపోలను అందుబాటులోకి తేనుంది. సంస్థ అవసరాలు, భవిష్యత్తు రవాణా ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని నగరంలో కొత్తగా 3 నుంచి 5 వరకు బస్ డిపోలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ముందస్తుగా ముషీరాబాద్‌లోని 5 ఎకరాల స్థలంలో హైదరాబాద్-3 డిపోను, నాగారం రోడ్డులోని 5 ఎకరాల విస్తీర్ణంలో జవహర్‌నగర్ డిపోను ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం వేగంగా చర్యలు తీసుకుంటోంది. వీటితో పాటు గతంలో రకరకాల కారణాలతో మూతబడిన రాణిగంజ్-2 డిపోను పునరుద్ధరించి, ఆధునిక వసతులతో రీ-మోడిఫికేషన్ చేసి త్వరలోనే పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 26 బస్ డిపోలు కొనసాగుతుండగా.. ఈ ఏడాది డిసెంబరు నాటికి వీటి సంఖ్యను 31కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో కొత్త డిపోల ఏర్పాటుకు తగిన స్థలాలు కేటాయించాలని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను ఆర్టీసీ అధికారులు కోరారు. శివారు ప్రాంతాల్లో డిపోలు అందుబాటులోకి వస్తే నగర శివార్ల ప్రజలకు ప్రజారవాణా మరింత సులభతరం కానుంది.ప్రస్తుతం గ్రేటర్ ఆర్టీసీ ప్రతినిత్యం సుమారు 2800 బస్సులను నడుపుతుండగా.. వాటిలో 493 ఎలక్ట్రిక్ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం హయత్ నగర్-2 డిపో నుంచి 98, హెచ్‌సీయూ డిపో నుంచి 101, కూకట్‌పల్లి డిపో నుంచి 20, మియాపూర్-2 డిపో నుంచి 100, కంటోన్మెంట్ డిపో నుంచి 80, రాణిగంజ్ డిపో నుంచి 75 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను పూర్తిస్థాయి ఈవీ జోన్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 26 డిపోలలోనూ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.నగర శివారు ప్రాంతాల్లోని ప్రతి డిపోలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి వచ్చే ఎలక్ట్రిక్ బస్సులు కూడా రాత్రి వేళల్లో సమీపంలోని ఈ డిపోలలో సులువుగా ఛార్జింగ్ చేసుకొని తెల్లవారుజామున మళ్లీ జిల్లాలకు తిరుగు ప్రయాణమయ్యే వెసులుబాటు కలుగుతుంది. ఈ చర్యల ద్వారా పర్యావరణహిత రవాణాతో పాటు నగరంలో బస్సు సర్వీసుల సమర్థత మరింత పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మొక్కజొన్న ఆల్ టైమ్ రికార్డ్

**అదిలాబాద్, ఆగస్టు 5 పెన్ పవర్:** తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న విక్రయాల్లో మార్క్‌ఫెడ్ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన టెండర్లలో చరిత్రలోనే తొలిసారిగా మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యాపారుల సిండికేట్‌ను అడ్డుకుంటూ ఈ-వేలం నిర్వహించగా.. టన్నుకు గరిష్ఠంగా రూ.26,500 ధర లభించింది. కొనుగోలు ధర కంటే టన్నుకు సగటున రూ.1,370 లాభం రావడంపై మంత్రి తుమ్మల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్నల విక్రయంలో మార్క్‌ఫెడ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. సంస్థ చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే అత్యధిక ధర లభించి రికార్డు స్థాయి లాభాలు నమోదయ్యాయి. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన పారదర్శక టెండర్ల వల్ల వ్యాపారుల సిండికేట్‌కు చెక్ పడటమే కాకుండా.. మార్క్‌ఫెడ్‌కు భారీగా ఆదాయం సమకూరింది.గతంలో ప్రతి ఏటా టెండర్ల సమయంలోవ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు కొటేషన్లు వేసేవారు. అధికారుల సహకారంతో తక్కువ ధరలకే విక్రయాలు జరగడం వల్ల మార్క్‌ఫెడ్ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఈ సంస్థ రూ. 1000 కోట్ల నష్టాల్లో ఉండటంతో పాటు, మరో రూ. 2 వేల కోట్ల అప్పుల భారంతో కూరుకుపోయింది. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి టెండర్ల ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు.మంత్రి ఆదేశాల మేరకు సిండికేట్లకు ఎలాంటి అవకాశం లేకుండా కేవలం ఈ-వేలం ద్వారానే టెండర్లు నిర్వహించాలని నిర్ణయించారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 చొప్పున, టన్నుకు కనీసం రూ.24 వేల కంటే తక్కువ ధర వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని కఠిన నిబంధన పెట్టారు. దీనికి అనుగుణంగా మార్క్‌ఫెడ్ యాసంగి సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన 14.60 లక్షల టన్నుల మొక్కజొన్నలో 10.98 లక్షల టన్నులకు గాను జులై 31, ఆగస్టు 1, ఆగస్టు 3 తేదీల్లో మూడు విడతలుగా విజయవంతంగా ఈ-వేలం నిర్వహించింది. అనంతరం సోమవారం అధికారులు ఆ టెండర్లను సమగ్రంగా పరిశీలించి ఖరారు చేశారు.ఈ మూడు విడతల వేలంలో మొక్కజొన్నకు ఊహించని విధంగా విశేష స్పందన లభించింది. టన్నుకు గరిష్ఠ ధర రూ. 26,500 పలకగా, ఇది వేలం కనీస ధర కంటే రూ. 2,500 ఎక్కువ కావడం విశేషం. కనిష్ఠ ధర కూడా మద్దతు ధర కంటే ఎక్కువగా రూ.24,100 గా నమోదైంది. మొత్తంగా ఈ విక్రయాల్లో సగటున టన్నుకు రూ. 25,370 ధర లభించింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు వెచ్చించిన సొమ్ముతో పోలిస్తే టన్నుకు సుమారు రూ. 1,370 లాభం సమకూరింది. సరైన నిర్ణయాలు, పారదర్శక విధానాల వల్ల సంస్థకు ఈ స్థాయిలో లాభాలు రావడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు.

## కాళేశ్వరమే అజెండా

**హైదరాబాద్, ఆగస్టు 5 పెన్ పవర్:**
తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని విసురుతున్న సవాళ్లు.. ఈసారి సభలో తీవ్ర దుమారం రేపేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం , మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, నిధుల వినియోగంపై జరగనున్న చర్చే ఈ సమావేశాల్లో ప్రధానాంశంగా మారనుంది.కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా, పరిపాలనాపరంగా తమకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుండగా, రైతుల నీటి అవసరాలను చూపుతూ ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలి అని చేపట్టిన నిరసనలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు రాజకీయాన్ని వేడెక్కించాయి. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే తిరిగి మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు బయటపడటంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా తీవ్ర ఆత్మరక్షణలో పడింది.ఇరిగేషన్ నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను ముందుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం బీఆర్ఎస్‌కు సవాలుగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం కేవలం పొలాలకు నీళ్లు ఇవ్వకుండా నాటకాలు ఆడుతోందని ఆరోపించింది. అయితే, వరద నీటి సహజ ప్రవాహం , ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వాదనకే బలాన్ని చేకూర్చడంతో, సోషల్ మీడియాలో సైతం బీఆర్ఎస్ రక్షణ ధోరణిలో పడాల్సి వచ్చింది.ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం అత్యంత స్పష్టంగా ఉంది. కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి రప్పించడం ద్వారా, ఆయన సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్ లోపాలు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ పురోగతి, మరియు రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండటాన్ని రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకుంటూ.. ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి తమ హయాంలో జరిగిన నిర్మాణాలను సమర్థించుకోవాలని సవాల్ విసురుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్గాలు కూడా ఈ సమావేశాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. కాళేశ్వరం అంశంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, ఆరుగాలం కష్టపడే రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని సభలో తిప్పికొట్టేందుకు కేటీఆర్, హరీష్ రావులు వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఇంకా ఉత్కంఠగానే మారింది. ఒకవేళ కేసీఆర్ సభకు హాజరైతే రేవంత్-కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష సభ సమరం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టంగా మారనుంది.ఈ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరంపై జరిగే చర్చ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రీ-డిజైన్ వైఫల్యం గా ప్రజల్లో శాశ్వతంగా ముద్ర వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఎండిపోతోంది అని నిరూపించేందుకు బీఆర్ఎస్ పోరాడుతోంది. అదే సమయంలో నిరుద్యోగ సమస్యలు సహా రాష్ట్రంలో ఉన్న అన్ని అంశాలను హైలెట్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాలు కేవలం చట్టసభల చర్చలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలక పోరాట వేదికగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

## తెలంగాణకు ప్రాజెక్టులు ఇచ్చినా.. కనిపించనా ఫలితం

**హైదరాబాద్, ఆగస్టు 5 పెన్ పవర్:**
ఏపీలోని విజయనగరం జిల్లాలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ అదే వేదిక నుంచి మరిన్ని ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. వీటిలో తెలంగాణలోకి ఖమ్మం, దేవరపల్లి ప్రాంతాలకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.అ యితే.. వీటిని ప్రస్తావిస్తూ.. తెలంగాణ బీజేపీ నాయకులు ఎక్కడా ప్రకటన చేయకపోవడం.. కనీసంకార్యక్రమాన్ని కూడా నిర్వహించకపోవడం గమనార్హం. నిజానికి ఏపీలో ప్రారంభించిన పలు ప్రాజెక్టుల్లో తెలంగాణకు చెందినవి.. అనుబంధంగాఉన్న ప్రాజెక్టులు కొన్ని ఉన్నాయి. కానీ, ఆ తరహా జోష్ తెలంగాణలో కనిపించకపోవడం గమనార్హంమోడీ ప్రారంభించిన వాటిలో.. కీలకమైన తెలంగాణ ప్రాజక్టుల విషయానికి వస్తే.. ఖమ్మం-దేవరపల్లి మధ్య ప్రధాన ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం కోసం.. కొన్నేళ్లుగా ఇక్కడివారు ఎదురు చూస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రభుత్వం కూడా విజ్ఞాపలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే -ఖమ్మం -దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ పోర్ లేన్స్ ఎక్స్‌ప్రెస్‌వే-ను కేంద్రం మంజూరు చేసింది. దీనిని తాజాగా ప్రధాని ప్రారంభించారు. అలాగే ఖమ్మం -దేవరపల్లి ప్యాకేజీలో భాగంగా..

ఎక్స్ ప్రెస్ వే పక్కన గ్రామీణ రహదారులను కూడా ప్రధాని ప్రారంభించారు. వీటిని మూడు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు.. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన.. ఫ్యూచర్ సిటీతోనూ అనుసంధానం చేయనున్నారు. మరి ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రారంభించిన సమయంలో తెలంగాణలో ఒక్క కార్యక్రమాన్ని కూడా బీజేపీ నాయకులు ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. ఇక, ఏపీలో నిర్మించిన.. అనంతపురం, కర్నూలు సౌర విద్యుత్ జోన్ల ట్రాన్స్ మిషన్ పథకాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. అయితే.. ఈరెండు జోన్ల ద్వారా.. కేవలం ఏపీలోని అనంతపురం,కర్నూలు ప్రాంతాలకే కాకుండా.. తెలంగాణలోని అనుబంధ జిల్లాలకు కూడా సౌర విద్యుత్‌ను అందించనున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణలో బీజేపీలో ఎక్కడా చలనం లేకపోవడం గమనార్హం.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## యాక్టివ్ పాలిటిక్స్ లోకి నల్లారి

**హైదరాబాద్, ఆగస్టు 5, పెన్ పవర్:**
ఏపీ బీజేపీలో చాలామంది నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు బాగానే గెలిచారు. 8 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి విజయం సాధించారు. మరో ముగ్గురు ఎంపీలు సైతం ఉన్నారు. ఒక రాష్ట్ర మంత్రి తో పాటు కేంద్ర మంత్రి కూడా ఉన్నారు.. ఎందరు ఉన్న బిజెపి పెద్దగా సౌండ్ చేయడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి లైన్ లోకి వచ్చారు. ప్రెస్ మీట్ పెట్టి రాష్ట్రాల మధ్య జలవివాదం గురించి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. జలవివాదాలు విషయంలో ఎటువంటి మొహమాటలకు పోవద్దని.. పక్క రాష్ట్రాలతో చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరం అనుకుంటే పోరాటం చేయాలని కూడా పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సాహేతుకంగా జరగలేదని.. అప్పట్లోనే జల పంపకాలు చేపడుతూనే వివాదాలు పరిష్కరించుంటే ఇంతవరకు పరిస్థితి వచ్చి ఉండేది కాదు అని అభిప్రాయపడ్డారు కిరణ్ కుమార్ రెడ్డి.ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్వచ్ఛందంగా తప్పుకోవడంతో.. స్పీకర్ గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆయన హయాంలోనే రాష్ట్ర విభజన జరిగింది. దానిని తీవ్రంగా వ్యతిరేకించారు కిరణ్ కుమార్ రెడ్డి. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. సొంతంగా సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అది అంతగా వర్కౌట్ కాలేదు. చివరకు బిజెపిలోకి వచ్చి ఆ పార్టీ తరఫున మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మీడియా ముందుకు వచ్చి రాష్ట్ర విభజన సమస్యలు, జలవివాదాలు గురించి ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రస్తుతం గోదావరి తో పాటు కృష్ణా జలాలకు సంబంధించి వివాదాలు నడుస్తున్నాయి. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం ఉంది. ఆపై పోలవరం ప్రాజెక్టు విషయంలో ఒడిస్సా తో పాటు చత్తీస్గడ్ తో కూడా వివాదం నడుస్తోంది. వాటన్నింటినీ పరిష్కరించుకోవాలని ఏపీ ప్రభుత్వానికి కిరణ్ కుమార్ రెడ్డి సూచించడం

గమనార్హం. అవసరం అనుకుంటే కేంద్ర ప్రభుత్వంతో గట్టిగా మాట్లాడాలని సూచిస్తున్నారు కిరణ్. ఎన్నికల వరకు మాత్రమే పొత్తు కానీ.. పార్టీలు, ప్రభుత్వం వేరు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు.

అయితే చాలా రోజులకు కిరణ్ కుమార్ రెడ్డి ముందుకు రావడం గమనార్హం. రాష్ట్రం కోసం కీలక సూచనలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే రాజ్యసభ ఎన్నికల సమయంలో కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ వివిధ సమీకరణల్లో ఆయనకు పదవి దక్కలేదు. ఇప్పుడు ఆయన పొలిటికల్ గా యాక్టివ్ అవుతారన్న టాక్ వినిపిస్తోంది. అందులో భాగంగానే సరిహద్దు జలాల వివాదంపై మాట్లాడుతున్నారని ప్రచారం సాగుతోంది. మరి చూడాలి ఆయన పాత్ర ఎలా ఉండబోతుందో..

## కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ

**హైదరాబాద్, ఆగస్టు 5 పెన్ పవర్:** నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని సులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ క్షేత్రాలను సందర్శించడం వెనక కారణం వేరే ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. ముఖ్యంగా చిత్ర పూజలు చేయడానికి హరీష్ రావు వేరే ప్రాంతాలలో ఉన్న క్షేత్రాలను సందర్శించారని.. అక్కడ క్షుద్ర పూజలు కూడా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏకంగా విలేకరుల ముందుకు వచ్చి హరీష్ రావును తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి నాయకులకు క్షుద్ర పూజలు చేయడం అలవాటేనని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏ తరహాలో వ్యవహరించింది అంతా తెలుసని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు హరీష్ రావు మీద చేస్తున్న ఆరోపణల పట్ల ఆయన వర్గం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించిందని.. ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయకపోగా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని హరీష్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు మీద హరీష్ రావు లీగల్ నోటీసులు ఇచ్చారు. తాను క్షుద్ర పూజలు చేశానని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని.. లేకపోతే పరువు నష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హరీష్ రావు ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి హరీష్ రావు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అయితే ఆ పుణ్యక్షేత్రాల సందర్శన వెనక క్షుద్ర పూజలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. హరీష్ రావు ఎన్ని రకాల పూజలు చేసినప్పటికీ గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని.. మళ్లీ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు.

## టీ కాంగ్రెస్ లో పట్టభద్రుల ఎన్నికల వేడి



**హైదరాబాద్, ఆగస్టు 5 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయం ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న కీలకమైన ఎన్నికలు కావడం, విద్యావంతులు, ఉద్యోగుల నాడిని ప్రతిబింబించే పోరు కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇటీవల జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సమరసన్నాహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏదేమైనా రెండు స్థానాల్లోనూ గెలిచి తీరాల్సిందేనని, విజయం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పార్టీ అధిష్ఠానం ముఖ్యనేతలకు స్పష్టమైన టార్గెట్ నిర్దేశించింది.అధికార పార్టీ తరఫున రేసులో నిలిచి ఎమ్మెల్సీగా సభలో అడుగుపెట్టేందుకు సీనియర్లు, యువ నేతలు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. పోటీకి దిగేందుకు ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. మహబూబ్‌నగర్ -- హైదరాబాద్ - - రంగారెడ్డి పట్టభద్రుల స్థానానికి ఆశావహులు భారీగా ఉన్నారు. ఇక రాజధాని నగరం పరిధిలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ -- హైదరాబాద్ -- రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల్లో పట్టున్న పలువురు ముఖ్య నేతలు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధిగా గుర్తింపు ఉన్న హర్ష వర్ధన్ రెడ్డి విద్యావంతుల మద్దతు తనకే ఉందనే ధీమాతో ఉన్నారు. సామ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ గా పార్టీ వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఆయన టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. టీ శాట్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న శివసేనా రెడ్డి యువత, విద్యావంతులలో మంచి గుర్తింపు పొందారు. ఇక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ రెడ్డి యువజన విభాగానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ రేసులో ముందంజలో ఉన్నారు. వీళ్లతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ సతీష్ తో పాటు మన్నె జీవన్ రెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.కాంగ్రెస్‌కు పట్టున్న ప్రాంతంగా భావించే నల్గొండ -- ఖమ్మం -- వరంగల్ పట్టభద్రుల స్థానానికి డిమాండ్ ఊహించని స్థాయిలో ఉంది. పార్టీలోని కీలక సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇక్కడ టికెట్ దక్కించుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి పేరు ఈ స్థానం నుంచి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నేతగా పేరుపొందిన చనగాని దయాకర్ సైతం విద్యార్థి, నిరుద్యోగ వర్గాల మద్దతు తనకే ఉందంటూ పోటీలో నిలిచారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఇందిర కూడా ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు.కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించిన అనంతరం, విజయావకాశాలు ఉన్న నేతలనే బరిలోకి దించాలని హైకమాండ్ సూచించింది. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయి సమీకరణాలు, ఉద్యమ నేపథ్యం, అలాగే పట్టభద్రులలో ఉన్న ప్రజాదరణ ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుల నిర్ణయంపైనే ప్రస్తుతం ఈ ఆశావహుల జాతకాలు ఆధారపడి ఉన్నాయి. ఎవరికి ఎమ్మెల్సీ టికెట్ వరిస్తుంది? అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తున్న ప్రధాన అంశం!

# అమరావతిలోనే మంత్రులు.. నివాసాలు రెడీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ రాజధాని అమరావతిలో రెండు కీలక నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని ఈ నెల 13న సీఎం చంద్రబాబు స్వయంగా ప్రారంభించనున్నారు. వీటిలో 1) సీడ్ యాక్సస్ రోడ్డు నిర్మాణం. ఇది 90 శాతం నిర్మాణం పూర్తయింది. అమరావతి నిర్మాణాలు ప్రారంభమైన నాటి నుంచే నిర్మాణం చేపట్టినా.. మధ్యలో కొందరు రైతులు భూములు ఇవ్వలేదు. దీంతో ఈ నిర్మాణంలో ఆలస్యం జరిగింది. అయితే.. ఇటీవల భూ సేకరణ ద్వారా వాటిని తీసుకున్నారు. దీంతో నిర్మాణాలు వడివడిగా ముందుకు సాగుతున్నాయి. జరుగుతున్న పనులు జరుగుతుండగానే.. ఇప్పటికే పూర్తయిన 90 శాతం సీడ్ యాక్సస్ రహదారిని సీఎం చంద్రబాబు ఈ నెల 13న ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ట్రయల్ రన్‌ను కూడా ప్రారంభించారు. మొత్తంగా 6 గ్రామాలను కవర్ చేస్తూ నిర్మించిన.. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు .. అమరావతికి తలమానికంగా నిలిచింది. ఇది అందుబాటులోకి రావడంతో అమరావతి నిర్మాణంలో కీలక ఘట్టం పూర్తయినట్టేనని అంటున్నారు. ఇక, రాష్ట్ర మంత్రివర్గం మొత్తం అమరావతిలోనే నివాసం ఉండేలా ప్లాన్ చేశారు. దీనికి సంబంధించి కూడా.. నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇండివిద్యువల్‌గా 3 స్టార్ రేటింగ్‌తో ఈ నివాసాల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇటీవల ప్రారంభించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా రెండు రోజుల్లో పూర్తి కానున్నాయి. వీటిని కూడా ఈ నెల 13నే సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. అనంతరం.. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కి వీటిని బదలాయిస్తారు. జీఏడీఅధీనంలో ఉండే ఈ మంత్రుల నివాసాలను ప్రాధాన్యాల వారీగా మంత్రులకు కేటాయిస్తారు. తద్వారా.. మంత్రులు పూర్తిసమయం అమరావతిలోనే ఉండనున్నారు. మొత్తం రాష్ట్ర మంత్రివర్గంలో 26 మంది మంత్రులు ఉన్నారు. వీరికి అనుకూలంగా 3 స్టార్ రేటింగ్‌తో ఆధునిక వసతులతో ఈ భవనాలను నిర్మించారు. 26 నివాసాలతో పాటు.. అతి పెద్ద పార్కులు, స్విమ్మింగ్ పూల్స్, ఆట స్థలాలు, ఎమ్యూజ్‌మెంటు పార్కులు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రాంతాలను నిర్మించారు. అలానే మరో 8 ప్రత్యేక నివాసాలను కూడా ఏర్పాటు చేశారు. వీటిని గెస్టులకు కేటాయించేలా ప్లాన్ చేయడం గమనార్హం.

# ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్...

**విజయవాడ, ఆగస్టు 5 పెన్ పవర్:**
రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు. పైకి కనిపించే ఈ ప్రశంసలు వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం. ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర–రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు. మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు–లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ–రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది. జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్ కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

# కేసుల్లో నేతలు... కిం కర్తవ్యం...

**విజయవాడ, ఆగస్టు 5 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, కీలక నేతలు వరుసగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ముందస్తు బెయిళ్ల కోసం హైకోర్టు మెట్లు ఎక్కడం లేదా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూకబ్జా, డెత్ సర్టిఫికెట్ల ఫోర్జరీ కేసుల విచారణ నెదుర్కొనడం, గుంటూరు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కిడ్నాప్ వివాదంలో చిక్కుకోవడం, మహిళా ఎస్ఐపై దౌర్జన్యం ఆరోపణలతో ఆముదాలవలస ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడం వంటి వరుస ఘటనలు విపక్షాన్ని తీవ్ర ఆత్మరక్షణలో పడేశాయి. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. ఆర్కే రోజా, కైలే అనిల్ కుమార్, విశ్వేశ్వర్ రెడ్డి వంటి కీలక నాయకులు సైతం రకరకాల క్రిమినల్ కేసులు, అరెస్టు భయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ నేతలను భయాందోళనకు గురిచేసేందుకే పోలీసులు, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయితే, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసులు ఎక్కువగా రాజకీయాలకు సంబంధం లేనివి. భూక్రమబద్ధీకరణ పత్రాల ఫోర్జరీ, బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం , సివిల్ తగాదాల్లో అపహరణలు , ఆన్–డ్యూటీ మహిళా పోలీసులపై భౌతిక దౌర్జన్యాలు వంటి తీవ్రమైన నాన్–బెయిలబుల్ క్రిమినల్ కేసులు .గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకులు, ప్రభుత్వం మారిన తర్వాత కూడా తమ పాత ధోరణినే కొనసాగించడం. స్థానిక అధికార యంత్రాంగంపై భౌతిక దాడికి దిగడం లేదా చట్టవ్యతిరేక భూ లావాదేవీలలో భాగస్వాములు

కావడం ద్వారా స్వయంగా కూటమి ప్రభుత్వానికి లీగల్ ఆధారాలను అందించి ఉచ్చులో చిక్కుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే సమయంలో సానుభూతి కోసం వైఎస్సార్‌సీపీ ఎంచుకున్న వ్యూహాత్మక రాజకీయ బాధితులుగా నిలిచే స్ట్రాటజీ కూడా కావొచ్చని భావిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం కావాలనే కేసులు పెడుతోందని ప్రజల్లో చూపించుకోవడం ద్వారా రాజకీయంగా మైలేజ్ పొందే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. అయితే, సివిల్ వివాదాలు, వ్యక్తిగత క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో ఈ పొలిటికల్ విక్టిమ్ కార్డ్ సరిగ్గా పనిచేయదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజలు భూకబ్జాలు, కిడ్నాప్ కేసులను పొలిటికల్ వెండెట్టాగా చూడటానికి సిద్ధంగా లేకపోవడమే వైఎస్సార్‌సీపీ నరేటివ్‌కు అతిపెద్ద అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఈ వరుస అరెస్టులు, ముందస్తు బెయిళ్ల కొట్టివేత పరిణామాలు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నియోజకవర్గ
స్థాయిలో నడిపించే ప్రధాన నాయకులే రోజులు, వారాల తరబడి అజ్ఞాతంలోకి వెళ్లడం లేదా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో స్థానిక శ్రేణుల్లో నాయకత్వ శూన్యత ఏర్పడుతోంది. ద్వితీయ శ్రేణి నాయకులు కనీసం నిరసన ప్రదర్శనలు చేసేందుకు కూడా వెనకడుగు వేసేలా ఈ చట్టపరమైన చర్యలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ తన డిఫెన్సివ్ మైండ్‌సెట్ నుండి బయటపడటం అత్యంత క్లిష్టంగా మారనుంది. చట్టబద్ధమైన నేరాలకు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ లీగల్, మీడియా విభాగాలు విఫలమవుతున్నాయని స్పష్టమవుతోంది. సరైన క్రిమినల్ రక్షణ ప్రణాళికలు లేకుండా, అధిష్ఠానం ఇచ్చే రాజకీయ హామీలను మాత్రమే నమ్ముకుని క్షేత్రస్థాయిలో దూకుడు ప్రదర్శిస్తున్న ఇన్‌ఛార్జ్‌లు చివరకు న్యాయపరమైన సంక్షోభంలో మునిగిపోతున్నారన్న అభిప్రాయం ఎక్కువగా ఆ పార్టీలో వినిపిస్తోంది.

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా...

**నెల్లూరు, ఆగస్టు 5 పెన్ పవర్:**
ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ఌలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు. దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్–జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్–జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో...సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట. ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి.

# దక్షిణ కోస్తా అభివృద్ధికి కొత్త అక్షమా?

**గుంటూరు, ఆగస్టు 5 పెన్ పవర్:** దక్షిణ కోస్తా అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు నీటి వనరులు, వ్యవసాయం, పోర్టులు, పారిశ్రామిక అవకాశాల గురించి ఎంత చెప్పినా, గత దశాబ్దంలో ఈ ప్రాంత భవిష్యత్తుపై అత్యధిక చర్చకు దారితీసిన అంశం మాత్రం అమరావతి . అయితే అమరావతి గురించి జరిగిన చర్చల్లో చాలా వరకు రాజకీయ వాదోపవాదాలే ప్రధానంగా నిలిచాయి. అభివృద్ధి కోణంలో దాని పాత్ర ఏమిటి? ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎంత? అనే ప్రశ్నలు మాత్రం చర్చకు రాకుండా ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. రాజధాని అంటే కేవలం శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కాదు. పరిపాలన, విధాన రూపకల్పన, పెట్టుబడులు, విద్య, వైద్యం, సేవారంగం, సాంకేతిక రంగాలు పరస్పరం అనుసంధానమయ్యే కేంద్రం. ప్రపంచంలోని అనేక ప్రణాళికాబద్ధ నగరాల అనుభవం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది.ఒక సమర్థవంతమైన రాజధాని తన సరిహద్దులకే అభివృద్ధిని పరిమితం చేయకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపును అందించగలగాలి. ఆ కోణంలో చూస్తే, అమరావతి విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కొలవడం సరైన ప్రమాణం కాదు. ప్రభుత్వ సంస్థలు ఎంత స్థిరంగా పనిచేస్తున్నాయి? ప్రైవేట్ పెట్టుబడులను ఎంతవరకు ఆకర్షించగలిగింది? సేవారంగం ఎంత విస్తరించింది? విద్యా, వైద్య సంస్థలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయి? నైపుణ్యాధారిత ఉద్యోగాలకు ఎంత మేర అవకాశాలు సృష్టించబడ్డాయి?... ఈ ప్రశ్నలే అమరావతి అభివృద్ధి విలువను నిర్ణయిస్తాయి.ఒక రాజధాని నగరం నిర్మాణం అంటే ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోటుకి తరలించడం మాత్రమే కాదు. ఒకచోట కేంద్రీకృతం చేయడమే కాదు. పరిపాలనా వ్యవస్థ స్థిరపడిన చోట నిర్ణయాల వేగం పెరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, న్యాయవ్యవస్థ, ప్రజా సేవలకు సంబంధించిన అనేక సంస్థలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది. దాని ప్రభావం క్రమంగా ప్రభుత్వ వ్యవస్థను దాటి ప్రైవేట్ పెట్టుబడులు, సేవారంగం, ఉపాధి అవకాశాల వరకు విస్తరిస్తుంది. అందుకే ఒక రాజధాని నగర విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కాదు; అక్కడ ఏర్పడిన సంస్థల బలంతో కొలవాలి.దక్షిణ కోస్తా అభివృద్ధి కథలో అమరావతి ఒక ప్రత్యేక అధ్యాయం. దీనిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమాహారంగా చూస్తే దాని పూర్తి విలువ అర్థం కాదు. ఒక రాజధాని నగరం పరిపాలనకు కేంద్రంగా మారవచ్చు. కానీ విద్య, వైద్యం, పరిశోధన, సాంకేతికత, సేవారంగం కలిసినప్పుడే అది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తుంది. సుమారు 217 చదరపు కిలోమీటర్ల (దాదాపు 53,700 ఎకరాల) రాజధాని నగర ప్రాంతం దీర్ఘకాలిక దృష్టితో రూపొందించబడింది.పరిపాలనతో పాటు నివాసం, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, పరిశోధన, సేవారంగం పరస్పరం అనుసంధానమయ్యే నగర నమూనాను ఇది లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ దృష్టిలో క్వాంటమ్ వ్యాలీ ప్రతిపాదన అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డీప్ టెక్నాలజీ, ఆధునిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇక అనుసంధానం కూడా అంతే కీలకం. సుమారు 189 కిలోమీటర్ల ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్ విజయవాడ--గుంటూరు--తెనాలి పట్టణ సముదాయాన్ని విస్తృత ప్రాంతీయ ఆర్థిక వలయంగా అనుసంధానించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.అదే విధంగా ప్రతిపాదిత విజయవాడ--అమరావతి మెట్రో కారిడార్ (సుమారు 35--38 కి.మీ.) విద్య, ఉపాధి, సేవారంగాన్ని మరింత దగ్గర చేసే పట్టణ రవాణా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. అయితే అమరావతి విజయాన్ని భవనాల సంఖ్య నిర్ణయించదు. విద్యార్థులను ఆకర్షించే విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి వైద్య సేవలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, నాలెడ్జ్ ఎకానమీ, వాటిని కలిపే రవాణా వ్యవస్థ---ఇవన్నీ కలిసినప్పుడే అది ప్రాంతీయ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుంది.ఏ ప్రాంతమైనా శాశ్వత అభివృద్ధిని సాధించాలంటే భౌతిక మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు సమాంతరంగా ఎదగాలి. అలాంటి వ్యవస్థ ఏర్పడినప్పుడే స్థానిక యువతకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడంతోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రతిభ, పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఈ కోణంలో చూస్తే, అమరావతి చుట్టూ విద్యా, వైద్య సంస్థల అభివృద్ధి కేవలం రాజధాని అవసరమే కాదు. దక్షిణ కోస్తా మానవ వనరుల నాణ్యతను పెంచే దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా చూడాలి.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ క్రమంగా భూమి, భవనాలు, పరిశ్రమల నుంచి జ్ఞానం, పరిశోధన, సాంకేతికత వైపు మారుతోంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా నాలెడ్జ్ ఎకానమీకి వేదికగా తీర్చిదిద్దాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సెమీకండక్టర్ పరిశోధన, డీప్–టెక్ స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు విజయవంతమైతే, అమరావతి దక్షిణ కోస్తా ఆర్థిక నిర్మాణానికి మరో కొత్త కోణాన్ని జోడించే అవకాశం ఉంది. అయితే ఈ ప్రయత్నాల విజయాన్ని ప్రకటనలతో కాదు; సంస్థల స్థాపన, పరిశోధన, పెట్టుబడులు, ఉపాధి సృష్టి వంటి స్పష్టమైన ఫలితాలతోనే కొలవాల్సి ఉంటుంది.ఒక్కటే. దాని అభివృద్ధి ప్రభావం గుంటూరు--కృష్ణా ప్రాంతానికే పరిమితమవుతుందా? లేక తూర్పు గోదావరి నుంచి నెల్లూరు వరకు మొత్తం దక్షిణ కోస్తాలో పెట్టుబడులు, సేవారంగం, విద్య, వైద్య రంగాల విస్తరణకు దోహదపడుతుందా? ఒక రాజధాని నిజమైన విజయాన్ని దాని పరిపాలనా సరిహద్దులు నిర్ణయించవు. దాని ప్రభావం ఎంత విస్తృత ప్రాంతానికి చేరిందన్నదే నిర్ణయిస్తుంది. అమరావతి కూడా అదే ప్రమాణంపై నిలబడాల్సి ఉంటుంది. "అయితే దక్షిణ కోస్తా అభివృద్ధి పటాన్ని మొత్తం ఒకసారి పరిశీలిస్తే, ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం కనిపిస్తుంది. గోదావరి డెల్టా నుంచి కృష్ణా, గుంటూరు, నెల్లూరు వరకు అభివృద్ధి ప్రవాహం ఒక దిశలో సాగుతుండగా, మధ్యలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మాత్రం మరో ప్రశ్నను మన ముందుంచుతోంది. సహజ వనరులు ఉన్నా, విస్తారమైన భాగం ఉన్నా, ఎందుకు అదే స్థాయి అభివృద్ధి అక్కడ కనిపించలేదు? ఇదే ఇప్పుడు పరిశీలించాల్సిన తదుపరి అధ్యాయం.

# 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..

**ఏలూరు, ఆగస్టు 5 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 9.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. అది కేవలం 2.27 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంతేకాదు చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 88శాతం.. అనంతపురం జిల్లాలో 87శాతం, నంద్యాల జిల్లాలో 56శాతం సాగు విస్తీర్ణం తగ్గింది

# 1053 కిలోమీటర్ల గ్రేట్ వాల్ ఆఫ్ ఆంధ్ర

**నెల్లూరు, ఆగస్టు 5 పెన్ పవర్:** వాతావరణ మార్పుల నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాలకు ఈ ఏడాది విపత్తుల ముంపు పొంచి ఉందని.. దానిని ఎదుర్కొనేందుకే గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కేంద్రం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని డీసీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేయాలని.. అదే గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అని పవన్ కళ్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ కోసం తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అడవుల విస్తరణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. సీడ్ బాల్స్‌తో అడవులను పెంచాలని నిర్ణయించిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుతో మరోసారి ముందుకొచ్చారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతుల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.రానున్న రెండు నెలల్లో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారుగ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాంజీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడానికి గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది.రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం వెట 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం.

*Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965*

## శ్రీరాముడు అందరివాడు.. మత సామరస్యానికి ప్రతీకగా ముస్లిం వ్యక్తి వ్యాఖ్యలు



మనుషుల మధ్య సోదరభావాన్ని, శాంతిని పెంపొందించే వార్తలు ఎప్పుడూ నెటిజన్ల మనసులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇటీవల సోషల్ మీడియా వేదికగా మత సామరస్యానికి అద్దం పట్టే ఓ అరుదైన దృశ్యం నెట్టింట విస్తృతంగా చర్చనీయాంశమైంది. సామాజికవేత్త సయ్యద్ హుస్సేనీ శ్రీరామునిపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెటిజన్ల హృదయాలను గెలుచుకుంటున్నాయి. శ్రీరాముడు ఏ ఒక్క వర్గానికో లేదా ఒక్క మతానికో సొత్తు కాదని.. ఆయన అందరివాడని ఆయన వ్యాఖ్యానించారు.

తాను కూడా పూర్తి విశ్వాసంతో "జై శ్రీరామ్" అని చెబుతానని పేర్కొన్న సయ్యద్ హుస్సేనీ.. రాముడు మర్యాద పురుషోత్తముడిగా ఈ ప్రపంచానికే గొప్ప ఆదర్శమని అభిప్రాయపడ్డారు. రామరాజ్యం అనేది కేవలం ఒక మతానికి సంబంధించిన భావన మాత్రమే కాదని, అది సమాజంలో న్యాయం, సమానత్వం, సుపరిపాలన ధర్మానికి ప్రతీక అని ఆయన స్పష్టం చేశారు. రామరాజ్యంలో మహిళలకు పూర్తి రక్షణ, ప్రజలందరికీ సమాన న్యాయం, పాలకుల బాధ్యత వంటి మహోన్నత విలువలు ఉన్నాయని వివరించారు. సమాజంలో శాంతి, సామరస్యం పునర్నిర్మించబడాలంటే శ్రీరాముడు చూపిన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు.తన వ్యాఖ్యల్లో దైవత్వం గురించి హుస్సేనీ చెప్పిన మాటలు నెటిజన్లను ఎంతగానో ఆలోచింపజేస్తున్నాయి. దేవుళ్లందరూ ఒక్కటేనని.. ముస్లింలు ఉండకూడదని దేవుళ్లు భావించి గాలిని ఇవ్వడం ఆపేస్తే మనం బతకలేమని ఆయన గుర్తుచేశారు. సృష్టికర్తయిన దేవుడికే లేని భేదభావాలు, వివక్ష మనుషులమైన మనకెందుకు అని ఆయన ప్రశ్నించారు. మతం పేరుతో మనుషుల మధ్య గోడలు కట్టకుండా, పరస్పర గౌరవం సోదరభావంతో జీవించాలని కోరారు.సోషల్ మీడియాలో ముస్లిం ప్రముఖులు లేదా సామాజిక కార్యకర్తలు శ్రీరాముడి ప్రాశస్త్యం గురించి, రామరాజ్యంలోని లౌకిక విలువల గురించి మాట్లాడటం ఇదే తొలిసారి కాదు. గతంలో కూడా పలువురు మేధావులు రామరాజ్యాన్ని పేదరికం లేని, వివక్షకు తావులేని సమాజంగా అభివర్ణించారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వీడియోపై నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మతం కంటే మానవత్వమే గొప్పదని, ఇలాంటి సందేశాలు సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తాయని మెజారిటీ నెటిజన్లు కొనియాడుతున్నారు. అదే సమయంలో దేశంలో మతాలకు అతీతంగా పరస్పర సహనం, విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉందంటూ నెట్టింట ఆరోగ్యకరమైన చర్చలు సాగుతున్నాయి.మొత్తానికి సయ్యద్ హుస్సేనీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట మత సామరస్యానికి సరికొత్త వేదికను ఏర్పాటు చేశాయి. సంకుచిత భావాలను పక్కన పెట్టి మానవత్వాన్ని చాటిచెప్పే ఇటువంటి సందేశాలు సమాజ పురోగతికి ఎంతో దోహదపడతాయని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.

## దుబాయ్‌లో అదృశ్యమైన హైదరాబాద్ యువతి.. నాలుగు నెలలుగా ఫోన్ స్విచ్ఛాఫ్.. కుటుంబంలో ఆందోళన



ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యువత అక్కడ అదృశ్యమవుతున్న ఘటనలు ఇటీవల తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన ఒక 24 ఏళ్ల యువతి దుబాయ్‌లో ఆచూకీ లేకుండా పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. గత నాలుగు నుంచి ఐదు నెలలుగా ఆమె ఉపయోగిస్తున్న ఫోన్ నంబర్లు స్విచ్ఛాఫ్ వస్తుండటంతో ఏమి జరిగిందో తెలియక ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**కుటుంబ భారాన్ని భుజాన వేసుకొని విదేశాలకు..**

పాతబస్తీ ప్రాంతానికి చెందిన ఈ యువతి మెడికల్ విద్యను పూర్తి చేసింది. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న తండ్రి మరణించడంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఒక్కసారిగా క్లిష్టంగా మారింది. దాంతో తన కుటుంబ బాధ్యతలను నెరవేర్చేందుకు ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఆమె విదేశాల్లో ఉద్యోగం చేయాలని గట్టిగా నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే గత ఏడాది ఆగస్టు నెలలో దుబాయ్ వెళ్ళిన ఆమె.. అక్కడి ఒక ప్రముఖ ఆస్పత్రిలో ఉద్యోగంలో చేరినట్లు కుటుంబ సభ్యులకు తెలిపింది. దుబాయ్ వెళ్లిన ప్రారంభంలో ఆమె ప్రతిరోజూ క్రమం తప్పకుండా కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడేది. తన ఉద్యోగ వివరాలు, అక్కడ ఉంటున్న పరిస్థితులు, తన దినచర్య గురించి ఎప్పటికప్పుడు సమాచారం పంచుకునేది. అయితే గత నాలుగు నుంచి ఐదు నెలలుగా పరిస్థితి పూర్తిగా తలకిందులైంది.

**నాలుగు నెలలుగా స్విచ్ఛాఫ్.. లభించని సమాచారం**

ఆమె ఉపయోగిస్తున్న రెండు మొబైల్ ఫోన్లు నిరంతరం స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబంలో ఆందోళన మొదలైంది. వాట్సాప్ లేదా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా ఎంత సంప్రదించేందుకు ప్రయత్నించినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తీవ్రంగా భయాందోళన చెందిన కుటుంబ సభ్యులు దుబాయ్‌లో నివసిస్తున్న తమ బంధువులు, తెలిసిన వారిని ఆశ్రయించారు. వారు స్థానికంగా ఉన్న ఆస్పత్రులు, ఆమె పనిచేస్తున్నట్లు చెప్పిన ప్రదేశాల్లో నివాస ప్రాంతాల్లో ఎంతగా వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదు.

**పోలీసులను ఆశ్రయించిన కుటుంబం**

బంధువుల ద్వారా చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో తీవ్ర మానసిక వేదనకు గురైన కుటుంబ సభ్యులు మంగళవారం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. తమ కుమార్తెను ఎలాగైనా గుర్తించి, క్షేమంగా స్వదేశానికి రప్పించాలని అధికారులను కన్నీళ్లతో వేడుకున్నారు. బాధితుల ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ , భారత రాయబార కార్యాలయం, దుబాయ్ స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లి యువతి ఆచూకీ కనుగొనేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు సమాచారం.

**విదేశాలకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఇటీవలి కాలంలో గల్ఫ్ దేశాలతో పాటు ఇతర విదేశాలకు ఉద్యోగాల కోసం వెళ్లే నిరుద్యోగులు ఇలా అదృశ్యం కావడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ తరహా ఘటనల నేపథ్యంలో విదేశాలకు వెళ్లే ఉద్యోగులు తమ నివాస స్థలం అడ్రస్, రూమ్‌మేట్స్ వివరాలను ఇంట్లో ఖచ్చితంగా పంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే తాము పనిచేస్తున్న కంపెనీ ఆఫర్ లెటర్, మేనేజ్‌మెంట్ కాంటాక్ట్ నంబర్లు కుటుంబ సభ్యుల వద్ద ఉంచడం చాలా అవసరం. స్థానికంగా ఉండే భారత రాయబార కార్యాలయం నంబర్లు, సహాయక బృందాల సమాచారాన్ని భద్రపరుచుకోవడం అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం పాతబస్తీలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న ఈ ఘటనపై పోలీసులు.. విదేశాంగ శాఖ వేగంగా స్పందించి బాధితురాలిని క్షేమంగా ఇంటికి చేరుస్తారని కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మా అబ్బాయి ప్రమాదం చేశాడని తెలీదు: కస్టడీలో సీదిరి



శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు ఒక రోజు కస్టడీకి తీసుకుని విచారించారు. ఈ సమయంలో ఆయనకు 20 నుంచి 30 ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా బాధిత కుటుంబాన్ని ఎందుకు మాయ చేసే ప్రయత్నం చేశారని ఆయనను ప్రశ్నించారు. అలానే బాధిత కుటుంబానికి 9 లక్షల రూపాయలు ఇవ్వజూపిన విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. అదేవిధంగా తన కుమారుడి స్థానంలో వేరే వ్యక్తి ప్రమాదం చేసినట్టు పోలీసులకు తప్పుడు సమాచారం ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అయితే.. వీటికి సీదిరి ఎక్కడా తడుము కోకుండా సమాధానాలు చెప్పినట్టు పోలీసులు తెలిపారు.

తన కుమారుడు ప్రమాదం చేసినట్టు తనకు అసలు తెలీదని.. తన స్నేహితుడితో కలిసి బుల్లెట్‌పై ప్రయాణించాడని అనుకున్నట్టు సీదిరి వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రమాదం జరిగి ఉంటుందని భావించానని, అందుకే.. తన కుమారుడి పేరును చెప్పలేదని ఆయన వెల్లడించారు. ఈ సమయంలో సీసీటీవీ ఫుటేజీలను చూపించగా.. అవి నకిలీవి ఎందుకు కాకూడదని ఆయన ప్రశ్నించారు. తమపై టీడీపీ నాయకులు కుట్ర చేస్తున్నారని.. ఈ కోణంలోనూ కేసును విచారించాలని ఆయన కోరారు. అదే సమయంలో బాధిత కుటుంబానికి 9 లక్షల రూపాయల ఇవ్వజూపామన్న దానిలో తమ పాత్ర లేదని.. మీడియా సృష్టించిందని సీదిరి తెలిపారు.


**నా గురించి మీకు తెలీదా?**

ఈ సమయంలో సీదిరి అప్పలరాజు పోలీసులను ఉద్దేశించి.. నా గురించి మీకు తెలియదా? అని వ్యాఖ్యానించారు. తాను దాదాపు 20 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నానని.. వైద్యుడిగా, రాజకీయ నేతగా కూడా ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. తనను అక్రమంగా ఈ కేసులో ఇరికించారని ఆయన వ్యాఖ్యానించారు. అయితే.. ఆయన చెబుతున్న విషయాలకు.. వాస్తవంగా జరిగిన దానికి సంబంధం లేకపోవడంతో మరో రోజు కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని కోర్టుకు తెలిపి. ఆయనను కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఏం జరిగింది?**

శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సీదిరి కుమారుడు ఆరవ్ వర్మ.. గత నెలలో బుల్లెట్ నడిపి.. ప్రమాదాని గురయ్యారు. ఓ గొర్రెల కాపరి దానయ్యను బలంగా ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అయితే.. దీనిని మసిపూసి మాయ చేసేందుకు.. కేసు నుంచి తన కుమారుడిని తప్పించేందుకు సీదిరి పన్నాగం పన్నారన్నది పోలీసులు చెబుతున్న మాట. ఈ క్రమంలో ఆరవ్ స్నేహితుడే ప్రమాదం చేశాడని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తర్వాత.. వాస్తవాలు తెలుసుకున్న పోలీసులు.. ఆరవ్‌ను అరెస్టు చేశారు. అనంతరం.. మోసం కేసులో సీదిరిని కూడా అరెస్టు చేశారు. మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఒక రోజు కస్టడీకి కోర్టు అనుమతించింది.

# ముదురుతున్న మోదీ వీడియో తొలగింపు వివాదం.. కేంద్రం కాళ్ల బేరానికి 'మెటా' ప్రతినిధులు





ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన ఒక వీడియోను ఫేస్‌బుక్ ప్లాట్‌ఫారమ్ నుంచి ఉన్నపళంగా తొలగించిన వ్యవహారం ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ, న్యాయపరమైన సంచలనానికి దారితీసింది. ఈ సున్నితమైన అంశంపై మెటా సంస్థ అందించిన వివరణ పట్ల కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాయి. మెటా సమాధానం ఏమాత్రం సంతృప్తికరంగా లేకపోవడంతో వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలోనే పరిస్థితి తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న పార్లమెంటరీ కమిటీ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ రాబోయే మూడు రోజుల్లోగా బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని స్పష్టమైన అల్టిమేటమ్ జారీ చేసినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో పాటు సోషల్ మీడియా వేదికల్లో మహిళలు, చిన్నారుల హక్కులకు భంగం కలిగించేలా వారిని అవమానించేలా లేదా చట్టానికి విరుద్ధంగా ఉండే ఎలాంటి కంటెంట్‌నైనా తక్షణమే తొలగించేలా మెటా కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ అత్యున్నత స్థాయిలో ఆదేశించింది. ఒకవేళ తమ ఆదేశాలను, సూచనలను బేఖాతరు చేస్తే ప్రస్తుతం భారత సమాచార సాంకేతిక చట్టం కింద మధ్యవర్తిత్వ డిజిటల్ సంస్థలకు లభిస్తున్న 'సేఫ్ హార్బర్' లేదా లీగల్ ఇమ్యూనిటీ రక్షణను పూర్తిగా ఉపసంహరించే దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.భారత్‌లో 'సేఫ్ హార్బర్' హోదాను గనుక మెటా కోల్పోతే ఆ సంస్థ ఇక్కడ ఊహించని రీతిలో భారీ న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, థ్రెడ్స్ , మెసెంజర్ వంటి విస్తృత ప్లాట్‌ఫారమ్‌లలో కోట్లాది మంది వినియోగదారులు పోస్ట్ చేసే కంటెంట్‌కు ఆయా సంస్థలకు ఇప్పటివరకు పరిమిత బాధ్యత మాత్రమే ఉండేది. అంటే వినియోగదారుల పోస్టులకు సంస్థను నేరుగా బాధ్యులను చేసే అవకాశం లేదు. అయితే ఈ చట్టపరమైన రక్షణ కవచం తొలగిపోతే ప్లాట్‌ఫారమ్‌లో ప్రత్యక్షమయ్యే ప్రతి అభ్యంతరకరమైన, ఉద్రేకపూరితమైన లేదా చట్టవిరుద్ధమైన పోస్టుకు మెటా యాజమాన్యమే నేరుగా చట్టసభలు, న్యాయస్థానాల ముందు బాధ్యత వహించాల్సి వస్తుంది. అంతేకాకుండా సంస్థ ప్రతినిధులపై నేరుగా క్రిమినల్ కేసులు నమోదు చేసే వీలు కూడా కలుగుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే తెలంగాణ పోలీసులు నమోదు చేసిన వివిధ కేసుల దర్యాప్తు పురోగతిపై కూడా ఈ పరిణామం గణనీయమైన ప్రభావం చూపే అవకాశముంది.

ఈ ఉద్రిక్త పరిస్థితుల నడుమ, మెటా ప్రతినిధి బృందం కేంద్ర సమాచార , సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో అత్యవసరంగా సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో వివాదాస్పద అంశానికి సంబంధించి సంస్థ వైఖరిని, భవిష్యత్తులో తీసుకోబోయే సాంకేతిక నియంత్రణ చర్యలను వివరించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మెటా ఇచ్చిన వివరణలతో పార్లమెంటరీ కమిటీ కానీ, ప్రభుత్వం కానీ సంతృప్తి చెందకపోవడంతో జుకర్‌బర్గ్ నుంచి నేరుగా బహిరంగ క్షమాపణ రావాల్సిందేనన్న కఠిన డిమాండ్‌పై కేంద్రం ఇప్పటికీ నిలకడగా ఉంది. రాబోయే రోజుల్లో ఈ పరిణామాలు భారత్‌లో గ్లోబల్ టెక్ దిగ్గజాల బాధ్యతను, డిజిటల్ కంటెంట్ నియంత్రణను, సేఫ్ హార్బర్ రక్షణ అంశాలను కొత్త మలుపు తిప్పే అవకాశముంది.

## వారు జనంతో ఆడుకున్నారు.. సింధు అకాడమీ ప్రారంభోత్సవంలో లోకేష్



వైసీపీ హయాంలో –ఆడుదాం ఆంధ్ర– పేరుతో ప్రజల సొమ్మును దోచేశారని మంత్రి లోకేష్ అన్నారు. జనంతో ఆడుకున్నారని విమర్శించారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ప్రజలకు క్రీడలపై ఆసక్తి పెంచుతున్నామని.. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులకు అండగా ఉంటున్నామని చెప్పారు. ఒకవైపు విద్యారంగం.. మరోవైపు క్రీడారంగం రెండింటినీ సమపాళ్లలో ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు.స్టార్ షట్లర్.. పీవీ సింధు విశాఖపట్నంలో నిర్మించనున్న క్రీడా ప్రాంగణానికి బుధవారం మంత్రి లోకేష్ భూమి పూజ చేశారు. ఇటీవల ఇక్కడ క్రీడా ప్రాంగణం, హాస్టల్ వసతి సహా.. అన్ని రకాల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో –పీవీ సింధు అకాడమీ– నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ మంత్రి లోకేష్ చేతుల మీదుగా నిర్వహించారు. తొలుత మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన మైదానాలను ఏర్పాటు చేస్తోందన్నారు.

పాఠశాల విద్య నుంచే క్రీడలపై ఆసక్తి పెరిగేలా ప్రోత్సహి స్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన కిట్లు నాసిరకంగా ఉండడంతోపాటు.. ప్రజల ధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం విద్యార్థులకు కిట్లను అందించడంతోపాటు.. ప్రముఖ క్రీడాకారులతో శిక్షణ కూడా ఇప్పించనున్నట్టు చెప్పారు.

ఈ సమయంలో పీవీ సింధుపై ప్రశంసలు గుప్పించారు. ఇటీవల జపాన్ టైటిల్ నెగ్గి దేశంలోనే మేలైన క్రీడాకారిణిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. మహిళలు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అనంతరం పీవీ సింధు మాట్లాడుతూ.. విశాఖలో నిర్మిస్తున్న క్రీడా భవనానికి ప్రభుత్వం ఎంతో సహకరించిందని తెలిపారు. అధికారులు సైతం తమకు ఎంతో సహకారం అందించారని పేర్కొన్నారు. దీనిని అత్యాధునిక వసతులతో నిర్మించనున్నట్టు తెలిపారు.

# 'ఏడు' ఏళ్ల నిరీక్షణ!

జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ని నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసి ఆగస్టు 5తో ఏడేళ్లు పూర్తయ్యాయి; మరికొద్ది రోజుల్లో, ఆగస్టు 9న, రాష్ట్ర హోదా కోల్పోయి కూడా ఏడేళ్లు నిండనుంది. ఈ రెండు నిర్ణయాలూ భారత చరిత్రలోనే అత్యంత సందేహాస్పదమైన లాక్‌డౌన్‌తో అమలయ్యాయి. వేలాది బలగాలను తరలించడం, 5,000కు పైగా రాజకీయ నేతలు, కార్యకర్తలను నిర్బంధించడం, కర్ఫ్యూతోపాటు సమాచార వ్యవస్థను పూర్తిగా స్తంభింపజేయడం వంటివి చోటుచేసుకున్నాయి. ఇవి అత్యవసర పరిస్థితి చర్యలే అయినా, అధికారికంగా ఎలాంటి అత్యవసర పరిస్థితి ప్రకటించలేదు. తమ చర్యలు తాత్కాలికమేనని, హింసారహిత ప్రాంతంగా కశ్మీర్‌ను మార్చి ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేస్తామని కేంద్ర ప్రభుత్వం వాదించింది. కానీ ఊహించినట్టుగానే హింస కొనసాగుతూనే ఉంది. గత ఏడాది పహల్గామ్ (ఏప్రిల్), ఢిల్లీ ఎర్రకోట (నవంబర్) ఉగ్రదాడులే ఇందుకు నిదర్శనం. అంతేకాదు, పూంచ్-రజౌరివంటి ఇంతకుముందు ప్రశాంతంగా ఉన్న ప్రాంతాలకూ హింస విస్తరించింది. ఆర్థికంగా చూసినా లోయ ఇప్పటికీ కష్టాల్లోనే ఉంది. జమ్మూ కశ్మీర్ 2025-26 ఆర్థిక సర్వే ప్రకారం, జాతీయ సగటుతో పోలిస్తే లోయ తలసరి ఆదాయం నిష్పత్తి 76.6 శాతానికి పడిపోయింది. 2013-14లో ఇది 79.9 శాతంగా ఉండేది. నిరుద్యోగిత జాతీయ సగటుకంటే దాదాపు రెట్టింపుగా ఉండగా, పట్టభద్రుల్లో నిరుద్యోగిత రేటు ఏకంగా 23.9 శాతానికి చేరింది.

పహల్గామ్ దాడికి కశ్మీరీ ప్రజలు హింసను పూర్తిగా తిరస్కరిస్తూ శాంతి ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలతో స్పందించారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణతో మొదలుపెట్టి, స్థానికంగా శాంతి నిర్మాణానికి కేంద్రానికి ఇది ఒక అవకాశంగా మారి ఉండాల్సింది. కానీ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ మరింత కఠినమైన భద్రతా విధానాన్నే ఎంచుకుంది. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర, జమ్మూ కశ్మీర్ చరిత్రలోనే అత్యంత సైనికీకరించిన యాత్రగా మారింది. అత్యంత బలహీన కారణాలతోనే జమ్మూ కశ్మీర్ పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ (పీఎస్ఏ), చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద పౌరులపై కేసులు నమోదవుతున్నాయి. జూలై 22న కానిస్టేబుల్ ఆషిక్ హుస్సేన్ ఖురేషీపై కాల్పులు జరిగిన తర్వాత, విచారణ కోసం 2,000 మందికి పైగా పిలుపు అందుకున్నారు. కర్ఫ్యూలు సాధారణమైపోయాయి, 2019 నుంచి దేశంలోనే అత్యధిక ఇంటర్నెట్, సమాచార వ్యవస్థ నిలిపివేతలు నమోదైన కేంద్రపాలిత ప్రాంతంగా ఇది నిలిచింది. ఆనాడు మోదీ ప్రభుత్వ చర్యలు ఎంత సంచలనాత్మకమో, ఎలా అమలు చేశారో కూడా అంతే కీలకమని కొద్దిమందే గుర్తించారు. గవర్నర్‌ను హోంమంత్రి "ఆదేశించి" సంతకం చేయించారని ఆయనే స్వయంగా తర్వాత వెల్లడించినట్టుగా, కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారానే ఆర్టికల్ 370ను నిర్వీర్యం చేశారు. రాష్ట్ర ప్రజలను, రాజకీయ నేతలను సంప్రదించే ప్రయత్నం కూడా చేయకుండా, పార్లమెంటు ద్వారా శాసనపరమైన నిర్ణయంతో రాష్ట్ర హోదాను తొలగించారు. 1956లో ఢిల్లీ రాష్ట్ర హోదా కోల్పోయిన తర్వాత, ఇలా రాష్ట్ర హోదా రద్దైన సందర్భం భారత్‌లో మరొకటి లేదు.

ఈ రెండు చర్యలూ కలిసి, భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను, సమాఖ్య వ్యవస్థ ప్రాథమిక నిర్మాణాన్ని తీవ్రంగా ఉల్లంఘించాయి. దేశ ప్రజాస్వామ్యంపై పడిన రెండో పెద్ద దెబ్బగా వీటిని పరిగణించాల్సి ఉన్నా, వివాదాస్పద జమ్మూ కశ్మీర్‌కు మాత్రమే పరిమితమైన అంశంగా వీటిని పక్కనపెట్టేశారు. సంఘర్షణాత్మక ప్రాంతాల్లో కఠిన చర్యలు సమర్థనీయమేనన్న భావన నైతికంగా, ఆచరణాత్మకంగా కూడా తప్పు. భారత్ తన వలస పాలన అనుభవం నుంచే ఇది నేర్చుకున్న గుణపాఠం. అణచివేత ఏదో మంచి ఫలితానికి మార్గంగా చూపడం, అణచివేత అనేది స్వతహాగానే ఒక అసహ్యకరమైన ముగింపు తప్ప, ఎప్పటికీ మార్గం కాదన్న వాస్తవాన్ని కప్పిపుచ్చడమే. ఆచరణలో చూసినా, శాంతియుత వ్యక్తీకరణకు అవకాశం లేనప్పుడు, అణచివేత అసంతృప్తిని పెంచి హింసగా మారుతుందని ఇటీవలి భారత చరిత్రే చెబుతోంది. అయినా, ఏడేళ్లుగా ప్రత్యక్ష పాలన కొనసాగించేందుకు ఈ వాదననే మోదీ ప్రభుత్వం వాడుకుంటూ వచ్చింది. సుప్రీంకోర్టు కూడా నాలుగేళ్ల పాటు కేంద్రం వాదననే వినిపించనిచ్చి, చివరికి వీలైనంత త్వరగా రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని బలహీనమైన సూచన మాత్రమే ఇచ్చింది. అప్పటినుంచి మరో మూడేళ్లు గడిచినా, పునరుద్ధరణకు కాలపరిమితి కోరుతూ దాఖలైన పిటిషన్లపై కోర్టు విచారణ చేపట్టలేదు. రాజ్యాంగం అత్యవసర పరిస్థితిని ఆరు నెలలకే పరిమితం చేసినా, జమ్మూ కశ్మీర్‌లో మాత్రం ఏడేళ్లుగా అలాంటి పరిస్థితులే కొనసాగుతున్నాయి. కఠిన చట్టాల దుర్వినియోగంపై జమ్మూ కశ్మీర్ హైకోర్టు పదేపదే అసంతృప్తి వ్యక్తం చేసినా, సంస్కరణలు మాత్రం కనిపించడం లేదు. రెండేళ్ల క్రితం ఎన్నికలు జరిగినా, ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాలు మాత్రం స్వల్పమే. 2024 బిజినెస్ రూల్స్ ప్రకారం, పరిపాలన, పోలీసు, ప్రభుత్వ న్యాయవాదులపై నియంత్రణ లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలోనే ఉంది; ఇప్పుడు టెలికమ్యూనికేషన్లపైనా ఆయనకు అత్యవసర అధికారాలు కట్టబెట్టారు. ప్రజలు ఎన్నుకోని అధికారిగా, ఆయన ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదు. అయితే, ఎన్నికైన పరిపాలనే జవాబుదారీతనానికి ఏకైక మార్గమని రాజ్యాంగమే స్పష్టం చేసింది. స్వతంత్ర శాసనసభ, పర్యవేక్షణ సంస్థలు, స్వేచ్ఛాయుత మీడియా వంటివి పటిష్టంగా ఉండాలంటే కూడా ఎన్నికైన ప్రభుత్వమే అవసరం. గత దశాబ్దంలో జమ్మూ కశ్మీర్ అనేక దురదృష్టకర "మొదటిసారి"లను చవిచూసింది. 2016లో పెల్లెట్ గన్ల విస్తృత వినియోగానికి గురైన తొలి రాష్ట్రంగా, 2019లో ప్రత్యేక ప్రతిపత్తి, రాష్ట్ర హోదా రెండింటినీ కోల్పోయిన తొలి రాష్ట్రంగా, 2022లో మతపరమైన డీలిమిటేషన్‌కు గురైన తొలి రాష్ట్రంగా నిలిచింది. అయితే, 2024 ఎన్నికల్లో బహుళత్వ నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికి మెజారిటీ దక్కడం ద్వారా మతపరమైన గెరిమాండరింగ్‌ను అధిగమించిన తొలి రాష్ట్రంగా కూడా అది నిలిచింది. ఇప్పుడు, ఏళ్లుగా నిరాకరించిన రాష్ట్ర హోదాను తిరిగి పొందిన తొలి రాష్ట్రంగా నిలవడమే జమ్మూ కశ్మీర్‌కు సముచితమైన మలుపు కావాలి. ఈ ఏడో వార్షికోత్సవం సందర్భంగా కూడా, హామీ నెరవేరలేదని, గాయాలు మానలేదని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పునరుద్ఘాటించడం, రాష్ట్ర హోదా ఇప్పటికీ ఒక కల ఆకాంక్షగానే మిగిలిపోయిందని స్పష్టం చేస్తోంది!!

## పనికొచ్చే పలుకు




# ఆత్మగౌరవమే.. అలంకారం..!

మనం మనల్ని ఎంత గౌరవించుకుంటే.. ప్రపంచంనుంచి అంత గౌరవం దక్కుతుంది. ఇది జీవిత సత్యం. మాట్లాడే తీరు, ధరించే దుస్తులు, నడిచే భంగిమ -మన లోపలి ఆత్మవిశ్వాసానికి నిలువుటద్దం. లోపల మనకు మనపై గౌరవం లేకపోతే, బయటకు ఎంత అలంకరించుకున్నా అది వెలవెలబోతుంది. దీనికి విరుద్ధంగా, ఆత్మగౌరవమున్న వ్యక్తి సాదాసీదా దుస్తుల్లో ఉన్నా, ఆ వ్యక్తిత్వం చుట్టూ ప్రపంచాన్ని ఆకర్షిస్తుంది. ఆత్మగౌరవమంటే.. గర్వమో, అహంకారమో కాదు. తనను తాను విలువైన వ్యక్తిగా గుర్తించడం, హద్దులను స్పష్టంగా నిర్దేశించుకోవడం, తనను తాను నిర్లక్ష్యం చేసుకోకుండా జాగ్రత్త తీసుకోవడం. ఎవరైనా మనల్ని అగౌరవపరిచినప్పుడు మౌనంగా భరించడం కాదు, సున్నితంగానైనా ధైర్యంగా స్పందించడమే నిజమైన ఆత్మగౌరవం. ఇది ఒక్కరోజులో అలవడేది కాదు, నిత్యం సాధన చేయాల్సిన జీవన విధానం. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకూ, మనం తీసుకునే ప్రతి చిన్న నిర్ణయంలోనూ ఈ గౌరవం ప్రతిబింబించాలి. సమయపాలన పాటించడం దగ్గర నుంచి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వరకూ, స్వీయ నిర్లక్ష్యానికి దూరంగా ఉండటం వరకూ అన్నీ ఇందులో భాగమే!

ఈ మార్పు మనిషి జీవనశైలిని సమూలంగా మారుస్తుంది. ఆత్మగౌరవం పెరిగినప్పుడు, మాట్లాడే తీరులో స్పష్టత వస్తుంది, గొంతులో వణుకు తగ్గి ధీమా చోటుచేసుకుంటుంది. దుస్తులు ఎంచుకునే విధానంలో కూడా అనవసర అభద్రతా భావం తగ్గి, తనకు నచ్చిన శైలిని ధైర్యంగా ఎంచుకునే స్వేచ్ఛ లభిస్తుంది. నడిచే భంగిమలో వెన్ను నిటారుగా ఉండటం, తలెత్తుకుని నడవడం వంటి చిన్న మార్పులే, చుట్టూ ఉన్నవారికి ఒక బలమైన సందేశాన్ని పంపిస్తాయి.. "నేను నన్ను గౌరవిస్తున్నాను, కాబట్టి నన్ను గౌరవించండి" అని. సంబంధాల్లో కూడా ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.. తనను తాను తక్కువ చేసుకునే వ్యక్తులను, ఇతరులు కూడా తక్కువగానే చూస్తారు. కానీ తనను తాను గౌరవించుకునే వ్యక్తి చుట్టూ, సహజంగానే గౌరవప్రదమైన సంబంధాలు ఏర్పడతాయి. ఈ భావననే ప్రఖ్యాత రచయిత్రి మాయా ఏంజెలో తన మాటల్లో పలుమార్లు ప్రస్తావించారు. "మనం ఇతరులతో ఎలా వ్యవహరించాలో నేర్పించేది మనం మనతో వ్యవహరించే తీరే"నని ఆమె భావం. వేమన శతకంలో "తనకు తానే గురువ"నే భావన పలుమార్లు ప్రస్తావితమవుతుంది. మనిషి తనను తాను తీర్చిదిద్దుకున్నప్పుడే, బయటి ప్రపంచం అతన్ని గౌరవిస్తుందని ఈ శతక పద్యాలు బోధిస్తాయి. "తనవల్లనే తనకు గౌరవంబు కల్గు, పరుల వలన గాదు పరమ సత్యం" అనే భావనతో కూడిన నీతి పద్యాలు, తరతరాలుగా ఆత్మగౌరవం విలువను నొక్కి చెబుతున్నాయి.

కాబట్టి, ప్రతిరోజూ అద్దంలో మనల్ని మనం చూసుకున్నప్పుడు, కేవలం బాహ్య రూపాన్ని కాకుండా, లోపలి వ్యక్తిత్వాన్ని కూడా గౌరవంతో చూసుకోవాలి. చిన్న చిన్న అలవాట్ల ద్వారా సమయపాలన, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, సానుకూల ఆలోచనలు -ఆత్మగౌరవాన్ని పెంపొందించుకోవచ్చు. ఈ మార్పు క్రమంగా జరిగినా, దాని ప్రభావం మాత్రం జీవితాంతం నిలిచిపోతుంది. మిమ్మల్ని మీరు గౌరవించుకోవడం మొదలుపెడితే, ప్రపంచం మిమ్మల్ని చూసే దృక్కోణమే మారిపోతుందనే వాస్తవాన్ని మీరే స్వయంగా అనుభవిస్తారు!!


# ఆకాశంనుంచీ వ్యవ'సాయం'!



వ్యవసాయ రంగంలో ఉపగ్రహ సాంకేతికత పాత్ర రోజురోజుకూ కీలకమవుతోంది. పంట విస్తీర్ణ పటాలు రూపొందించడం మొదలుకొని, దిగుబడి అంచనాలు వేయడం, ప్రకృతి వైపరీత్యాల నష్టాలను కచ్చితంగా లెక్కగట్టడం వరకూ ఉపగ్రహ చిత్రాల సాయం అనివార్యమవుతోంది. రైతులనుంచి విధాన నిర్ణేతల వరకూ అందరికీ సరైన సమాచారం, తాజా పరిజ్ఞానం అందించి, సకాలంలో నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సాంకేతికత దోహదపడుతోంది. చిన్న కమతాలు, విభిన్న వాతావరణ పరిస్థితుల మధ్య సాగు చేసే భారతీయ రైతులకు ఇది మరింత అవసరం. వర్షాధార ప్రాంతాల్లో, అనూహ్యంగా మారుతున్న రుతుపవనాల నేపథ్యంలో ముందస్తు హెచ్చరికలు, కచ్చితమైన సమాచారం లేకుండా సురక్షిత సేద్యం సాధ్యం కాదు. గత దశాబ్దకాలంలో దేశంలో ఉపగ్రహ ఆధారిత వ్యవసాయ పర్యవేక్షణ గణనీయంగా విస్తరించింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మొదలుకొని, ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, మధ్యప్రదేశ్ అగ్రి జీఐఎస్, పశ్చిమ బెంగాల్ బంగ్లా సస్య బీమా యోజనవంటి పథకాలన్నీ ఈ సాంకేతికతపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. ఇస్రో ఇటీవల అభివృద్ధి చేసిన సస్య అనే కృత్రిమ మేధ ఆధారిత పంట మ్యాపింగ్ సాధనం, ఈవోఎస్-04 (రిశాట్-1ఏ) ఉపగ్రహం అందించే సింథటిక్ ఎపర్చర్ రాడార్ డేటాను వినియోగించుకుంటూ, పంటల ఆరోగ్యాన్ని మరింత కచ్చితత్వంతో అంచనా వేయగలుగుతోంది. కృషి-డీఎస్ఎస్ వంటి నిర్ణయ మద్దతు వ్యవస్థలు, జాతీయ పంట పర్యవేక్షణ కార్యక్రమాలు కూడా ఈ ఉపగ్రహ డేటా ఆధారంగానే రూపొందుతున్నాయి. వ్యవసాయ ప్రమాదాలను ముందుగానే గుర్తించి, తుపానులు, వరదలు, కరవు వంటి విపత్తుల సమయంలో సకాలంలో హెచ్చరికలు జారీ చేసేందుకు ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ వంటి వాతావరణ ఉపగ్రహాలు కూడా తోడ్పడుతున్నాయి. ఇలాంటి కొత్త ఆవిష్కరణలతో, భారత వ్యవసాయం క్రమంగా క్రియాశీల నిర్వహణ దిశగా అడుగులేస్తున్నా, ఈ మొత్తం వ్యవస్థలో స్వదేశీ సాంకేతికత వాటా మాత్రం ఇప్పటికీ పరిమితమే.

ప్రస్తుతం భారత వ్యవసాయ రంగం ఉపగ్రహ డేటా కోసం ఎక్కువగా విదేశీ వనరులపైనే ఆధారపడుతోంది. ఐరోపా అంతరిక్ష సంస్థ ప్రయోగించిన సెంటినెల్ ఉపగ్రహాలు ఉచితంగా అందించే మధ్యస్థాయి రిజల్యూషన్ చిత్రాలే, పంట భూముల సాధారణ మ్యాపింగ్‌లో దాదాపు 80 శాతం అవసరాలను తీరుస్తున్నాయి. ఆ తర్వాత అమెరికా ల్యాండ్‌శాట్ ఉపగ్రహ డేటా, భారతీయ ఉపగ్రహాల డేటాను వినియోగిస్తున్నారు. అధిక రిజల్యూషన్ చిత్రాల కోసం మాత్రం విదేశీ వనరులపైనే ఎక్కువగా ఆధారపడక తప్పడం లేదు. ఉష్ణోగ్రత, తేమ, గాలివేగం, సౌర వికిరణం వంటి వాతావరణ డేటాసెట్లు, ఆకు వైశాల్యం వంటి జీవసంబంధ సమాచారం కూడా ఎక్కువగా విదేశీ ఉపగ్రహాల నుంచే లభిస్తోంది. డిజిటల్ వ్యవసాయానికి కీలకమైన పొలాల ప్రాదేశిక సమాచారం కోసం సైతం విదేశీ నావిగేషన్ ఉపగ్రహాలపైనే ఆధారపడుతున్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన నావిక్ నావిగేషన్ వ్యవస్థ అందుబాటులో ఉన్నప్పటికీ, వ్యవసాయ అనువర్తనాల్లో దాని వినియోగం ఇప్పటికీ నామమాత్రమే. డేటా విశ్లేషణ కోసం అత్యంత ప్రజాదరణ పొందిన గూగుల్ ఎర్త్ ఇంజిన్ వంటి వేదికలపైనే అధిక శాతం సంస్థలు ఆధారపడుతుండగా, కొన్ని అగ్రిటెక్ కంపెనీలు మాత్రమే సొంత ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించుకున్నాయి. ఇలా విదేశీ అంతరిక్ష సాంకేతికతపై అతిగా ఆధారపడటం ఏ దేశానికీ శ్రేయస్కరం కాదు. దీర్ఘకాలంలో ఇది భౌగోళిక-రాజకీయ సున్నితత్వాలకు, డేటా లభ్యతలో అనిశ్చితికి దారితీసే ప్రమాదముంది. అంతర్జాతీయ సంబంధాల్లో ఏవైనా ఒడిదుడుకులు తలెత్తినా, ఆంక్షలు విధించినా, భారత వ్యవసాయ డేటా వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉంది. ఆహార భద్రతవంటి వ్యూహాత్మక రంగంలో ఇది ఎంతమాత్రం క్షమించరాని లోపం.

ఈ పరిస్థితిని అధిగమించేందుకు స్వదేశీ ఉపగ్రహ డేటా నాణ్యతను, లభ్యతను గణనీయంగా మెరుగుపరచడం తక్షణావసరం. 1988 నుంచి ఇప్పటివరకూ అనేక భారతీయ ఉపగ్రహాలు భారీ మొత్తంలో సమాచారాన్ని సేకరించి నిల్వ చేసినా, దాన్ని వినియోగార్హంగా మార్చకపోవడం పెద్ద లోటుగా మిగిలింది. అమెరికా ల్యాండ్‌శాట్ ఉపగ్రహ డేటా ప్రపంచవ్యాప్తంగా విస్తృత వినియోగంలో ఉన్న తీరును స్ఫూర్తిగా తీసుకుని, ఇస్రో తన దీర్ఘకాలిక డేటాసెట్లను రైతు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. ఇందుకోసం విద్యాసంస్థలు, డేటా సైన్స్ సంస్థలు, అంతర్జాతీయ నిపుణులతో సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. 2022లో ప్రయోగించిన రిశాట్-1ఏ (ఈవోఎస్-04) ఉపగ్రహం, మేఘావృత వాతావరణంలోనూ భూ ఉపరితల చిత్రాలను తీయగల సామర్థ్యంతో, నేల తేమ అంచనా, పంటల ఆరోగ్య పర్యవేక్షణలో కీలకంగా మారే అవకాశమున్నా, దీని వినియోగం ఇప్పటికీ పరిమితంగానే కొనసాగుతోంది. ఈ ఉపగ్రహ జీవితకాలం ఇప్పటికే సగం పూర్తయినందున, పంటల మ్యాపింగ్, ఆరోగ్య పర్యవేక్షణ వంటి అప్లికేషన్లలో దీన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా వేగంగా అడుగులు వేయాలి. త్వరలో అమెరికా అంతరిక్ష సంస్థ నాసాతో కలిసి ఇస్రో ప్రయోగించనున్న నిసార్ ఉపగ్రహం, నాటడం నుంచి కోత వరకూ పంటల వృద్ధిని అత్యంత కచ్చితత్వంతో పర్యవేక్షించగలదని అంచనా. నేల, పంటల్లోని తేమ శాతాన్ని కూడా ఈ ఉపగ్రహం కచ్చితంగా గుర్తించగలదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది సాగు నీటి యాజమాన్యం, నాటే సమయాన్ని నిర్ణయించడంలో రైతులకు గణనీయంగా ఉపయోగపడనుంది. అధిక పునరావృత సమయంతో కూడిన ఈ డేటా, పంట ఉత్పత్తి అంచనాలను మరింత కచ్చితంగా వేసేందుకు, నీటి కేటాయింపును సమర్థంగా ప్రణాళిక చేసేందుకు ప్రభుత్వాలకు ఎంతగానో దోహదపడుతుంది. అయితే, కేవలం కొత్త ఉపగ్రహాలు ప్రయోగించడం మాత్రమే పరిష్కారం కాదు. కొత్త ఉపగ్రహాలను ప్రయోగించి అదనపు డేటాసెట్లను సేకరించే ముందు, ఇప్పటికే అందుబాటులో ఉన్న స్వదేశీ డేటా నాణ్యతను, లభ్యతను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. డేటా ప్రాసెసింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, రైతుస్థాయిలో అర్థమయ్యే రీతిలో సమాచారాన్ని అనువదించడం, స్థానిక భాషల్లో అందుబాటులోకి తేవడం వంటివి కూడా ఇందులో భాగం కావాలి. లేనిపక్షంలో అంతరిక్ష సాంకేతికతలో స్వయంసమృద్ధి సాధించే లక్ష్యం అందని ద్రాక్షే. సామాజిక ప్రయోజనాల కోసం భారత్ దశాబ్దాల క్రితమే అంతరిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినా, వ్యవసాయ రంగంలో పూర్తి స్వావలంబన లక్ష్యానికి ఇంకా ఆమడ దూరంలోనే ఉండటం విచారకరం. ఈ అంతరాన్ని పూడ్చేందుకు ఇస్రో, వ్యవసాయ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సిన సమయమిది. అంతరిక్ష సాంకేతికతను రైతు వేదిక వరకూ చేరవేయగలిగినప్పుడే, భారత వ్యవసాయం నిజమైన డిజిటల్ పరివర్తనను సాధించగలదు, అప్పుడే ఆకాశం నుంచి అందే సమాచారం నేలపై నిజమైన మార్పును తీసుకురాగలదు. ■



జెన్ జీకి చిన్న సలహా. అనవసరమైన మాటలు కట్టిపెట్టండి. పనిపై మాత్రమే శ్రద్ధ పెట్టండి. జాబు రాలేదని బాధపడేకంటే.. చిన్నదైనా వ్యాపారం ప్రారంభించి డబ్బు సంపాదించడం మొదలుపెట్టండి. డబ్బుతో మరింత డబ్బు ఎలా సంపాదించాలో నేర్చుకోండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. చెత్త తినడం మానేసి.. కొంచెమే అయినా మంచి ఆహారం తీసుకోండి. మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోండి. ముందు తరాల వైఫల్యాలను ఎత్తి చూపడం కంటే.. మీరైనా తరువాతి తరాలకు ఆదర్శంగా నిలబడే ప్రయత్నం చేయండి. వీటిలో ఏ కొన్ని అలవాటుచేసుకున్నా.. అనుసరించినా.. - మిమ్మల్ని మీరు ఉత్తములుగా తీర్చిదిద్దుకుంటున్నట్టే. వట్టి మాటలు కట్టిపెట్టి.. గట్టి మేలు తలపెట్టమన్నాడు గురజాడ. అదే చేయండి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# పచ్చబొట్టు నొప్పించదులే!



సూదులతో నొప్పి భరించాల్సిన అవసరం లేకుండానే శాశ్వత పచ్చబొట్టు వేయించుకోవచ్చు! బ్రిటన్‌కు చెందిన 'సైఫర్ ఎక్స్' స్టార్టప్ ప్రపంచంలోనే తొలి నొప్పిలేని పర్మనెంట్ టాటూ విధానాన్ని ఆవిష్కరించింది. రక్తం, సూదులంటే భయపడే తన సీఈఓ ఫెర్డినాండ్ కోల్ ఈ టెక్నాలజీని రూపొందించారు. సూక్ష్మ నిర్మాణాలతో కూడిన ఒక పాచ్‌ను చర్మంపై అతికించి, 15 నిమిషాల పాటు ఉంచితే, అందులోని రంగు చర్మం పైపొరల్లోకి చేరుతుంది. మొదట్లో మసకగా కనిపించే డిజైన్, 24-48 గంటల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, ఇది శాశ్వతమైనదే కావడంతో తొలగించాలంటే లేజర్ చికిత్సే మార్గం. ప్రస్తుతం 15 మిల్లీమీటర్ల చిన్న డిజైన్లు, కేవలం నలుపు రంగులోనే అందుబాటులో ఉన్నాయి. లండన్‌లో మాత్రమే ప్రస్తుతం ఈ సేవలు లభిస్తున్నాయి.

# సిరుల అన్నం..మిల్లెట్స్ ప్రస్తావన వచ్చినప్పుడు ఎక్స్‌పర్ట్స్ చెప్పే మాటలివె





"సూపర్ ఫుడ్, వండర్ గ్రెయిన్".. మిల్లెట్స్ ప్రస్తావన వచ్చినప్పుడు ఎక్స్‌పర్ట్స్ చెప్పే మాటలివి. "హై కార్బ్, మూడు పూటలా తింటే వెరీ డేంజర్".. ఇవి అన్నం ప్రస్తావన వచ్చినప్పుడు చెప్పే మాటలు. అయినా.. జనాలు అన్నమే ఎందుకు తింటున్నరు అంటే దీనికి చాలా కారణాలు ఉన్నయ్. హరిత విప్లవం నుంచి ప్రభుత్వ విధానాల వరకు అన్ని అన్నానికే ఓటేశాయ్?. ఇప్పుడు 'యూ' టర్న్ తీసుకుని మళ్లీ పాత పద్ధతులే మేలు అంటున్నరు ఎక్స్?పర్ట్స్?. ఒకప్పుడు పేదల ఆకలిని తీర్చిన ఈ చిరు ధాన్యాలు ఇప్పుడు వాళ్లకే దూరమైనయ్?. అందుకే వాటిని మళ్లీ అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఐక్యరాజ్య సమితితోపాటు చాలా దేశాలు ప్రయత్నిస్తున్నయ్?. అందులో భాగంగానే అందరూ మధ్యాహ్న భోజనంగా మిల్లెట్స్? తీసుకోవాలని మన ప్రధాని నరేంద్ర మోడీ కూడా చెప్తున్నరు.
పల్లెల్లో పెద్దవాళ్లు "పండుగలు, పబ్బాలకే తెల్లన్నం తినేటోళ్లం. మిగతా రోజుల్లో తైద అంబలి, జొన్న రొట్టెలు, సామల అన్నమే దిక్కు" అని చెప్తుంటారు. తర్వాత ఆ పరిస్థితి నుంచి.. రోజూ అన్నం తిని ఎప్పుడో ఒకసారి మిల్లెట్స్? తినే పరిస్థితికి వచ్చారు. కానీ.. ఇప్పుడు మళ్లీ పాత అలవాట్లే మంచివని, మిల్లెట్స్? తినాలని న్యూట్రిషనిస్ట్?లు చెప్తున్నారు. అంతెందుకు మన ప్రధానితోపాటు ఐక్యరాజ్య సమితి కూడా 'చిరు ధాన్యాలతోనే ఆరోగ్య సిరి' అంటోంది. అసలు మిల్లెట్స్?లో ఏముంది? నిజంగానే వాటిని తినాల్సిన అవసరం ఉందా? అన్నీ తెలిసినా అన్నమే ఎందుకు తింటున్నారు?

## ఎన్విరాన్‌మెంట్‌కు మంచిది

మిల్లెట్స్? సాగు మనకే కాదు.. ఎన్విరాన్?మెంట్?కు కూడా మేలు చేస్తుందని సైంటిస్ట్?లు అంటున్నారు. "ఇప్పుడు తింటున్న ధాన్యాల దిగుబడిని పెంచడం, వాటిని చీడల నుంచి తట్టుకునే విధంగా డెవలప్? చేయడం కంటే.. వాటితోపాటు చిరు ధాన్యాలను పండించి, తినడం మంచిద"ని చెప్తున్నారు. అలా చేయడం ఎన్విరాన్?మెంట్?కు కూడా మంచిదని నిరూపించారు. 2019లో ఇండియాలో కొంత విస్తీర్ణంలో వరి సాగుకు బదులు మిల్లెట్స్? (సజ్జలు, జొన్నలు లాంటివి) వేసి, పరిశీలించారు. అప్పుడు సైంటిస్ట్?లు ఈ పంటలు వరితో పోలిస్తే తక్కువ గ్రీన్?హౌజ్? గ్యాస్?ను విడుదల చేస్తాయని, వాతావరణంలో మార్పులు రాకుండా కాపాడేందుకు ఈ పంటలు ఉపయోగపడతాయని తెలుసుకున్నారు. వరితో పోలిస్తే.. నీళ్లు, శ్రామిక శక్తి కూడా తక్కువ అవసరం అవుతాయని చెప్పారు. ఈ పంటలు పండడానికి సింథటిక్ ఎరువులు, పురుగు మందులు అవసరం లేదు. కాబట్టి కెమికల్? ఫ్రీ. దాదాపు అన్ని రకాల మిల్లెట్స్?కి పైపొర చాలా గట్టిగా ఉంటుంది. ఇవి చాలా చిన్న సైజ్?లో ఉంటాయి. అందుకే కరువు, తెగుళ్ళను, వాతావరణ పరిస్థితులను తట్టుకుంటాయి.

## ఎక్కడైనా పండుతాయి

వరి, గోధుమలతో పోలిస్తే తక్కువ టైంలో పండుతాయి. చాలా రకాల మిల్లెట్స్ 70%--%100 రోజుల్లో పండుతాయి. కానీ.. వరి, గోధుమలు పండడానికి 120%--%-150 రోజులు పడుతుంది. అంతేకాదు వరి, గోధుమలతో పోలిస్తే వీటిని పండించడానికి నీళ్ల అవసరం తక్కువే. మిల్లెట్స్? పండడానికి తక్కువలో తక్కువ 350%--%500 మిల్లీమీటర్లు వర్షపాతం అవసరం. అదే వరి, గోధుమలకు అయితే 600-%--%1,200 మిల్లీమీటర్ల వర్షం కావాలి. అంటే తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాల్లో కూడా మిల్లెట్స్? పండుతాయి. కొండ ప్రాంతాల్లో కూడా పండించొచ్చు.
కర్నాటకలోని తుంకూరుకు 70 కి.మీ దూరంలో సిరా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో హెూండూరే గ్రామం ఉంది. ఆ గ్రామంలో కోరలె రఘు అనే రైతు ప్రతి ఏడాది వానాకాలంలో మొక్కజొన్న పండిస్తుంటాడు. ఆ ప్రాంతంలో నీటికి చాలా కరువు ఉంటుంది. ఎక్కువమంది వర్షం మీద ఆధారపడి సాగు చేస్తుంటారు. ప్రతిసారి సరిగ్గా వర్షాలు పడకపోవడంతో పంటలు సరిగా పండేవి కాదు. దాంతో కొన్నేండ్ల క్రితం రఘు అందు కొర్రల సాగు మొదలుపెట్టాడు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. వర్షాలు పెద్దగా పడకపోయినా మంచి దిగుబడి వస్తోంది. 2011లో మొదటిసారి ఎనిమిదిన్నర ఎకరాల్లో అందు కొర్రలు సాగు చేశాడు. అప్పుడు 80 క్వింటాళ్ల దిగుబడిని సాధించాడు. ఆ తర్వాత దిగుబడి మరింత పెరిగింది. పంటలో కొంత భాగం తోటి రైతులకు విత్తనాల కోసం అమ్ముతున్నాడు. మిగతా పంటను మార్కెట్?లో అమ్ముతున్నాడు. రఘును చూసి ఎంతోమంది రైతులు నీళు ్లన్నా కూడా మిల్లెట్స్? సాగు చేయడానికే ఇష్టపడుతున్నారు. హెూండూరేలో ఇప్పుడు చాలామంది రైతులు అందు కొర్రలు పండిస్తున్నారు.

## ప్రపంచవ్యాప్తంగా డిమాండ్

కొన్నేండ్ల నుంచి ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్స్?కి డిమాండ్? ఏర్పడింది. అందులోనూ కరోనా తర్వాత డిమాండ్? మరింత పెరిగింది. కానీ.. డిమాండ్?కు సరిపడా ప్రొడక్షన్? లేకపోవడంతో కొన్ని రకాల మిల్లెట్స్? ధరలు పెరుగుతున్నాయి. అందుకే ఈ వెలితిని భర్తీ చేసేందుకు యూఎన్?వోతో పాటు చాలా దేశాలు పనిచేస్తున్నాయి. మిల్లెట్? సాగు విస్తీర్ణం, ప్రొడక్షన్?లో మన దేశానికి 19 శాతం గ్లోబల్? షేర్ ? ఉన్నప్పటికీ దేశంలోని మొత్తం ఆహార ఉత్పత్తిలో అది చాలా తక్కువ. ప్రపంచంలో ఎక్కువగా సహార చుట్టు పక్కల ఉన్న ఆఫ్రికన్? దేశాల్లో, ఆసియా అంతటా ఉన్న చిన్న కమతాల రైతులే వీటిని పండిస్తున్నారు. ఈ పంటలు ఫుడ్?, పశువుల మేత, బయో ఫ్యుయెల్స్?ని అందిస్తున్నాయి. ప్రస్తుతం మన దేశం ఏటా దాదాపు 170 లక్షల టన్నుల మిల్లెట్స్?ని ఉత్పత్తి చేస్తుంది. 2017%--%-18 నుండి 2020%--%-21 సంవత్సరాల్లో సగటున 11 శాతం విస్తీర్ణంలోనే మిల్లెట్స్? పండిస్తున్నారు. ఇది మొత్తం ఆహార ఉత్పత్తుల్లో కేవలం 6 శాతం మాత్రమే. అయినా.. ఆసియాలోని మిల్లెట్స్ ప్రొడక్షన్?లో? 80 శాతం ఇండియాదే. అందులోనూ రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి. మన దేశం 2021 -22లో 34.32 మిలియన్ యూఎస్ డాలర్ల విలువైన మిల్లెట్స్?ని ఎగుమతి చేసింది. 2020 - 21లో 26.97 మిలియన్ డాలర్లు, 2019 -20లో 28.5 మిలియన్ డాలర్ల విలువైన మిల్లెట్స్? ఎగుమతి చేసింది. ఇండియా నుంచి ఎక్కువగా యూఏఈ, నేపాల్, సౌదీ అరేబియా, లిబియా, ఒమన్, ఈజిప్ట్, ట్యునీషియా, యెమెన్, యూకే, అమెరికాలు దిగుమతి చేసుకుంటున్నాయి. అయితే.. ఇండోనేసియా, బెల్జియం, జపాన్, జర్మనీ, మెక్సికో, ఇటలీ, యూఎస్, ఇంగ్లాండ్, బ్రెజిల్, నెదర్లాండ్స్ దేశాలు ఇతర దేశాల నుంచి మిల్లెట్స్‌ని ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాయి.

## అందానికి కూడా..

మిల్లెట్స్‌లో విటమిన్ -సి, ఇ ఉంటాయి. ఇవి నేచురల్ సన్‌స్క్రీన్‌లుగా పనిచేస్తాయి. ఎండవల్ల స్కిన్ దెబ్బతినకుండా, డల్‌గా, డార్క్‌గా మారకుండా కాపాడతాయి. కొత్త స్కిన్ సెల్స్ పుట్టేందుకు సాయం చేస్తాయి. అంతేకాదు.. మిల్లెట్స్ స్కిన్‌ని ఎప్పుడు హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. పొడిబారకుండా కాపాడతాయి. యాంటీ ఏజింగ్‌కు కూడా బాగా పనికొస్తాయి. వయసు మీద పడిందనడానికి సూచనలు.. నల్ల మచ్చలు, మొటిమలు, ముడతలు. అవి రాకుండా మిల్లెట్స్ స్కిన్‌ని కాపాడతాయి. రోజూ మిల్లెట్స్ తింటే జుట్టుకు కూడా బలం. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. ఇవి తలపై బ్లడ్ సర్క్యులేషన్‌ని పెంచుతాయి. దాని వల్ల జుట్టు వేగంగా పెరుగుతుంది.

### కొన్నేండ్ల నుంచి..

ఇప్పటికే కొన్నేండ్ల నుంచి మిల్లెట్స్?కు డిమాండ్? పెరుగుతూ వస్తోంది. కాకపోతే.. ఇదివరకు పల్లెల్లో ప్రజలే ఎక్కువగా వీటిని తినేవాళ్లు. ఇప్పుడు సిటీల్లో ఉండే ప్రజలు తినడానికి ఇష్టపడుతున్నారు. ఎందుకంటే.. ఇదివరకు ఇవి బియ్యం కంటే తక్కువ ధరకు దొరికేవి. కానీ.. ఇప్పుడు సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల దాదాపు చాలా రకాల మిల్లెట్స్? బియ్యం కంటే చాలా ఎక్కువ రేటు ఉన్నాయి. అందుకే ఆదాయం ఎక్కువగా ఉన్నవాళ్లే వీటిని తింటున్నారు. సాగు విస్తీర్ణం పెరిగి, ప్రొడక్షన్? పెరిగితే.. బియ్యం కంటే తక్కువ ధరకు దొరికే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే వీటికి మార్కెట్ కూడా బాగానే ఉంది. కొన్ని కంపెనీలు ఇప్పుడు ట్రెండ్? ఫాలో అవుతూ... రకరకాలుగా మార్కెట్ చేస్తున్నారు. ఉదాహరణకు బాజ్రా ఫ్లేక్స్, జొవార్ ఫ్లేక్స్, జొన్న పిండితో చేసిన పాన్‌కేక్ మిక్స్, రాగి, జోవర్ దోస మిక్స్, రాగితో చేసిన డెజర్ట్ మిక్స్ లాంటివి మార్కెట్?లో ఉన్నాయి. అందులోనూ కొన్ని బ్రాండ్‌లు "క్లీన్ లేబుల్ సర్టిఫికెట్", "వంద శాతం హెూల్‌గ్రెయిన్ సర్టిఫికెట్" తీసుకుని ప్రొడక్ట్స్‌ని మార్కెట్‌లోకి తెస్తున్నాయి.

### లాభాలెన్నో..

ప్రకృతి మనకు ప్రసాదించిన గొప్ప కానుకలు మిల్లెట్స్?. కానీ.. మనలో చాలామంది వాటిని పట్టించుకోవడంలేదు. అవి మన బాడీకి అనేక రకాల రోగాలను ఎదుర్కోవడంలో సాయం చేస్తాయి.

## అవసరమా?

మిల్లెట్స్? సాగును పెంచాల్సిన అవసరం ప్రపంచానికి ఎంతగానో ఉంది. ఎందుకంటే.. కొన్నేండ్ల నుంచి ప్రకృతి విపత్తులు ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గ్లోబల్? వార్మింగ్?, పెరుగుతున్న నీటి కొరత, తక్కువ సాగు భూమి, ఎక్కువ జనాభా లాంటి ప్రస్తుత పరిస్థితుల్లో ఇండియా... మిల్లెట్స్? సాగు తప్పనిసరిగా చేయాలని చెప్తున్నారు సైంటిస్ట్?లు. పైగా మన జనాభాలో 14 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సమస్యను తీర్చే శక్తి మిల్లెట్స్?కు ఉందని ఎక్స్?పర్ట్స్? చెప్తున్నారు. మిల్లెట్స్? తినడం ఇండియన్స్?కి కొత్తేమీ కాదు. హరిత విప్లవానికి ముందు అందరూ ఇవే తిన్నారు. పైగా వీటితో అనేక రకాల సంప్రదాయ వంటకాలు చేసుకోవచ్చు. అంతెందుకు వీటితో రెడీ టు కుక్?, రెడీ టు ఈట్? ఫుడ్స్? కూడా అందుబాటులోకి తీసుకురావొచ్చు.

## మన దగ్గర పండించేవి...

ప్రపంచవ్యాప్తంగా ప్రాంతీయంగా పండే అనేక రకాల మిల్లెట్స్ ఉన్నాయి. మన దగ్గర మాత్రం ఎక్కువగా జొన్నలు (జొవార్), సజ్జలు (పెర్ల్ మిల్లెట్), రాగులు(ఫింగర్ మిల్లెట్), లిటిల్ మిల్లెట్ (చామలు), ఫాక్స్‌టైల్ మిల్లెట్ (కొర్రలు), ప్రోసో మిల్లెట్ (వరిగెలు), బార్న్యార్డ్ మిల్లెట్ (ఊదలు), కోడో మిల్లెట్(అరికలు) పండిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్?లో వీటి రేట్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. జొన్నలు, సజ్జలు, రాగుల రేట్లు కూడా పెరుగుతూ వస్తున్నాయి. 2017 - 18లో జొన్నల కనీస మద్దతు రేటు 1,725 రూపాయలు ఉండేది. 2022 - 23కి 2,990 రూపాయలకు పెరిగింది. అలాగే సజ్జల రేటు 1,425 నుంచి 2,350కి, రాగుల రేటు 1,900 నుంచి 3,578కి పెరిగాయి.

## మిల్లెట్ మిషన్

మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, వినియోగం పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది. అందులో భాగంగానే మిల్లెట్స్ సాగును ప్రోత్సహిస్తోంది. మిల్లెట్స్? ప్రమోషన్ కోసం దేశంలోని కొన్ని సిటీల్లో మిల్లెట్ ఎక్స్‌పోలను ఏర్పాటు చేస్తున్నారు. తంజావూరులో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మిల్లెట్ ప్రాసెసింగ్ (ఐఎస్ఎంపీ)ని ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉంది. మిల్లెట్ మిషన్‌లో భాగంగా ఇండియాని గ్లోబల్ మిల్లెట్స్ హబ్‌గా మార్చాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. అంతేకాదు.. గతేడాది డిసెంబర్‌లో పార్లమెంట్‌లోని అఖిల పక్ష ఎంపీలకు మిల్లెట్స్ ఫుడ్‌తో లంచ్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జరిగే జీ%--% 20 సదస్సులో కూడా అన్ని రకాల ఫుడ్ వెరైటీలను మిల్లెట్స్?తోనే వండుతామని కేంద్ర మంత్రి జై శంకర్? చెప్పారు.

## బడ్జెట్‌లో

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023%--%24 వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ముఖ్యంగా వ్యవసాయం, రైతుల కోసం కొన్ని పథకాలను ప్రస్తావించారు. అందులో దేశ వ్యాప్తంగా రైతులను ఎట్రాక్ట్ చేసిన పథకం 'శ్రీ అన్న యోజన'. మిల్లెట్స్ సాగు విస్తీర్ణం, వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఈ స్కీంని తీసుకొచ్చారు. ప్రసంగంలో మిల్లెట్స్‌ని 'శ్రీ అన్న' అన్నారు. అలా పలకడం వెనక ఉన్న కారణాన్ని తర్వాత మోదీ కర్నాటకలో ఒక బహిరంగ ర్యాలీలో చెప్పారు. కర్నాటకతోపాటు సౌత్ ఇండియాలోని కొన్ని ప్రాంతాల్లో మిల్లెట్స్?ని 'సిరి ధాన్యం' అని పిలుస్తారు. దాన్ని వ్యవహారికంలో 'శ్రీ ధాన్యం' కూడా అంటారు. అందుకే మిల్లెట్స్?ని 'శ్రీ అన్న' అని పిలుస్తున్నారు. అంతేకాదు 'శ్రీ అన్న' అంటే అన్ని ఆహార ధాన్యాల్లో అత్యుత్తమమైనది అనే అర్థం కూడా ఉందన్నారు. మిల్లెట్స్? రుచిగా ఉండడంతో పాటు వాటిలో పోషకాలు పుష్కలంగా ఉండడం వల్ల కర్ణాటకలో 'శ్రీ ధాన్యం' అని పిలుస్తున్నారని వ్యవసాయ నిపుణులు అంటున్నారు.

## ఎన్నికల మేనిఫెస్టోలో

సెంట్రల్? గవర్నమెంట్ మిల్లెట్ మిషన్ తీసుకొచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మిల్లెట్స్ సాగు, వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయి. కర్నాటకలో ఈ మధ్య జరిగిన ఎన్నికలప్పుడు బీజేపీ పార్టీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. అందులో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి ప్రతి నెలా 5 కిలోల బియ్యంతో పాటు 5 కిలోల మిల్లెట్స్? అందిస్తామని చెప్పారు.

## ాయుధ బలగాలకు మిల్లెట్స్

కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సెంట్రల్ ఆర్మ్‌డ్‌పోలీస్ ఫోర్స్), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)కు పెట్టే భోజనంలో 30శాతం మిల్లెట్స్ అందించాలని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఈ మధ్యే నిర్ణయం తీసుకుంది. అందుకోసం మిల్లెట్ బేస్‌డ్ మెనూను రెడీ చేయాలని బలగాలకు చెప్పింది.

## యూపీలో ప్రత్యేక పథకం

ఉత్తరప్రదేశ్ గవర్నమెంట్ కూడా మిల్లెట్స్‌ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఒక పథకాన్ని తీసుకొచ్చింది. "ఉత్తరప్రదేశ్ మిల్లెట్స్ రివైవల్ ప్రోగ్రామ్"లో భాగంగా రాష్ట్రంలోని 75 జిల్లాల్లో రైతులకు ప్రతి సంవత్సరం మిల్లెట్స్? విత్తనాల మినీ కిట్‌ను ఫ్రీగా ఇస్తారు. ఈ ఏడాది మొదలైన ఈ పథకం నాలుగేండ్ల వరకు కొనసాగుతుంది. అంతేకాకుండా ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తారు.

# మధుమేహం.. తెలిసీ తెలిసీ ఎందుకీ పొరపాట్లు?

తెలియకపోతే ఏమో అనుకోవచ్చు. తెలిసీ పొరపాట్లు చేస్తే? అశ్రద్ధ, అలసత్వం, నిర్లక్ష్యం అనే అనుకోవాలి. ఇప్పుడు మధుమేహం (డయాబిటిస్) విషయంలో ఇదే జరుగుతోంది. సరిదిద్దుకోకపోతే ముమ్మందు ఇబ్బందులు తప్పవు. అప్పుడు విచారిస్తే ఫలితమేమీ ఉండదు. గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకున్నట్టే అవుతుంది. ప్రస్తుతం మధుమేహం (డయాబిటిస్) గురించి తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. చాలామందికి అంతో, ఇంతో తెలుసు. ఇప్పటివరకూ దీన్ని అదుపులో ఉంచుకోవటం తప్పించి, నయం చేసే మందు లేదనీ తెలుసు. మధుమేహంతో కలిగే చెడు పరిణామాలు, సమస్యలు.. వాటితో తలెత్తే అనర్థాలు సైతం తెలుసు. సమస్యలు వస్తే ఎంత ఖర్చవుతుందో, ఎన్ని ఇబ్బందులకు గురి అవుతారో తెలుసు. ఒక్కోసారి ప్రాణానికీ అపాయం ముంచుకొస్తుందనీ తెలుసు. ఇన్ని తెలిసినా మధుమేహం విషయంలో ఎన్నో పొరపాట్లు చేస్తున్నారు. వైద్యంలో, మందులు వేసుకోవటంలో ఎన్నెన్నో తప్పులు చేస్తున్నారు. ఎందుకిలా జరుగుతోంది? మనమంతా ఆలోచించాల్సిన సంగతి ఇది. పొరపాట్లు, అజాగ్రత్తలు జరగకుండా చూసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలం. అప్పుడే మనకీ, మన కుటుంబానికీ, మన సమాజానికీ ఉపయోగపడగలం.

## అతిపెద్ద పొరపాటు

మధుమేహం గల చాలామందిలో ఒక పెద్ద పొరపాటు కనిపిస్తుంటుంది. వారికి షుగర్ వ్యాధి ఉందని తెలుసు. మాత్రలు వాడుతుంటారు లేదా మానేసి ఉంటారు. లేకపోతే మోతాదు తక్కువగా తీసుకుంటుంటారు. జ్వరానికో, దగ్గుకో, కాలు వాచిందనో డాక్టర్ దగ్గరికి వచ్చినప్పుడు జబ్బు ఉందని చెప్పరు. డాక్టర్ అడిగితే లేదంటారు. ఎప్పుడో చేసిన రక్త పరీక్ష రిపోర్టు చూపిస్తారు. అది నార్మల్‌గా ఉంటుంది. మళ్లీ పరీక్ష చేయించమంటే మొండికేస్తారు. మందులు రాయించుకొని వెళతారు. జబ్బు తగ్గదు. మళ్లీ అనుమానం వచ్చి అడిగితే మొన్న మీరు రిపోర్టు చూశారు కదా అంటారు. తరచి తరచి అడిగితే 'ఎప్పుడో ఉండేది, మాత్రలు వాడితే తగ్గిపోయింది' అని చెబుతారు. పైగా 'మీరు కూడా మొన్న లేదన్నారు కదా' అంటారు. ఇలాంటి ఇబ్బందికర సందర్భాలు తరచూ ఎదురవుతుంటాయి. ఏ సమస్య కోసం డాక్టర్ దగ్గరికి వెళ్లినా మధుమేహం గలవారు తమకు షుగర్ ఉందనే విషయాన్ని తప్పకుండా చెప్పాలి. ఇది అదుపులో లేకపోతే ఎన్నో అనర్థాలు తలెత్తుతాయి. కాబట్టి ఇలాంటి పొరపాటు అసలే చేయొద్దు. ఇప్పటి చిన్న కాలు వాపు లాంటి సమస్యే నిర్లక్ష్యం చేస్తే పెను ప్రమాదం తెచ్చిపెట్టొచ్చు.

## మూత్ర పరీక్ష ఎప్పుడు?

చాలామంది పొద్దున లేవగానే పోసే మొదటి మూత్రాన్ని పట్టి పరీక్ష కోసం ఇస్తుంటారు. ఇది అంత కచ్చితం కాదు. ఒకసారి మూత్రం పోసి, మళ్లీ అరగంట తర్వాత వచ్చే మూత్రాన్ని నమూనాగా తీసుకోవాలి. లేకపోతే టిఫిన్ గానీ భోజనం గానీ చేసిన రెండు గంటల తర్వాత పట్టిన మూత్రంలో షుగర్ పరీక్ష చేయించాలి. అయితే గమనించాల్సిన విషయం ఏంటంటే- మూత్రంలో షుగర్ ఉన్నంత మాత్రాన అది మధుమేహం కాదు. రక్త పరీక్షతోనే దీన్ని నిర్ధారించాలి. ఇది అతి ముఖ్యమైన విషయం.

కొన్నిసార్లు గర్భిణులు, పాలిచ్చే తల్లులకు.. విటమిన్ సి, యాంటీబయాటిక్స్, టెట్రాసైక్లిన్ మందులు వాడుతున్నప్పుడు, రీనల్ గ్లైకోజూరియా అనే జబ్బు ఉన్నప్పుడు మూత్రంలో గ్లూకోజు కనిపించొచ్చు. దీన్ని మధుమేహంగా భావించి చికిత్స చేస్తే గ్లూకోజు మరీ తక్కువకు పడిపోయే (హైపోగ్లైసీమియా) ప్రమాదముంది.

## రక్త పరీక్ష ఎప్పుడు?

రక్తంలో గ్లూకోజు పరీక్ష కొత్తేమీ కాదు. చాలామందికి తెలిసిన విషయమే. తరచూ చేయించుకుంటూనే ఉంటారు. అయినా పొరపాట్లు చేస్తుంటారు. పరగడుపున (ఫాస్టింగ్ బ్లడర్ షుగర్): ఇది కడుపు ఖాళీగా ఉన్నప్పుడు (రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకూ ఏమీ తినకుండా) చేసే పరీక్ష. దీన్ని ఉదయం 6 గంటల నుంచి 8 గంటల లోపు చేయించుకోవాలి. దీని ఫలితం 100 ఎంజీ/డీఎల్ దాటితే మధుమేహం ఉందేమోనని సందేహించాలి. కొందరు పొద్దున 10 గంటలకు వచ్చి లేచిన దగ్గరి నుంచి 'పచ్చి మంచినీళ్లు కూడా తాగలేదు. పరగడపు పరీక్ష చేయండి' అంటుంటారు. అప్పుడు తీసిన రక్తం ఫాస్టింగ్ అవ్వదు. ఎందుకంటే శరీరంలోని హార్మోన్లు విడుదలై, గ్లూకోజు మోతాదులను నియంత్రిస్తాయి. మనం ఉపవాసం చేసినా, లంఖణం ఉన్నా నీరసం, నిస్త్రాణ వచ్చి చనిపోయే స్థితికి వెళ్లకపోవటానికి కారణం ఇదే. భోజనం చేశాక (పోస్ట్ పాండియల్ బ్లడ్ షుగర్): భోజనం చేసిన 2 గంటల తర్వాత రక్తంలో గ్లూకోజు 140 ఎంజీ/డీఎల్ దాటకూడదు. ఇది 200 ఎంజీ/డీఎల్, అంతకన్నా మించితే మధుమేహం ఉన్నట్టే.

రోజులో ఎప్పుడైనా (ర్యాండమ్ బ్లడ్ షుగర్): తినటంతో నిమిత్తం లేకుండా ఏదో ఒక సమయంలో తీసిన రక్త నమూనాలో గ్లూకోజు 200 ఎంజీ/డీఎల్ దాటితే మధుమేహం ఉన్నట్టు. అయితే ఇది 160, 170 ఉన్నంత మాత్రాన షుగర్ లేనట్టు కాదు. నిర్ధారణ కోసం మరిన్ని పరీక్షలు అవసరం.

మూడు నెలల సగటు (హెచ్‌బీఏ1సీ): దీన్ని రోజులో ఎప్పుడైనా చేయించుకోవచ్చు. ఇందులో రక్తంలో మూడు నెలల సగటు గ్లూకోజు శాతం తెలుస్తుంది. సాధారణంగా ఇది 5.7% లోపు ఉండాలి. 6.5% దాటితే మధుమేహం ఉన్నట్టే. చికిత్స తీసుకుంటున్నప్పుడు 7.0% లోపు ఉండేట్టుగా చూసుకోవాలి.

## డాక్టర్లను మార్చటం కాదు

మధుమేహం ఉందని, మందులు వేసుకుంటూ ఉంటారు. కానీ గ్లూకోజు అదుపులో ఉండదు. దీంతో మందుల మోతాదు పెంచమనో, లేకపోతే మార్చమనో ఒత్తిడి చేస్తుంటారు. వారు చెప్పినట్టు చేయకపోతే డాక్టర్లను మార్చేస్తుంటారు. ఇందులో లోపం ఎక్కడుంది? కొంచెం సేపు ఆలోచిస్తే అసలు నిజం తెలుస్తుంది. మధుమేహం అదుపులోకి రావాలంటే మందులు ఒక్కటే వేసుకుంటే సరిపోదు. ఆహార, వ్యాయామ నియమాలనూ పాటించాలి. కానీ అంతా కేవలం మందుల మీదే ఆధారపడుతుంటారు.

ఆహారం విషయంలోనూ అంతా చెప్పేది ఒక్కటే. 'టీలో, కాఫీలో పంచదార వేసుకోవటం లేదు. కొంచెమే తింటున్నాను. అయినా షుగర్ కంట్రోల్‌లో లేదు' అనే. కొంచెమే తిన్నారు సరే. దాన్నుంచి లభించే కేలరీలు ఖర్చు కావటానికి ఏం చేశారు? కాఫీలో, టీలో పంచదార వేసుకోలేదు. మరి అందులో ఉన్న పాలలోని షుగర్ సంగతో?

ఇక వ్యాయామం దగ్గరికి వస్తే- 'రోజంతా ఆఫీసు పని, ఇంట్లో పని. కాసేపు రిలాక్స్ అవటానికి టీవీ, స్నేహితులతో కాలక్షేపం. వ్యాయామం చేయటానికి టైమ్ ఉండటం లేదు' అని చెబుతుంటారు. ఆరోగ్యం కోసం ఆ మాత్రం సమయం కేటాయించలేరా? అసలు రహస్యం బద్ధకం. శీతాకాలమైతే చలి. వేసవిలో ఉక్కపోత, నిద్రలేమి, నీరసం. వర్షాకాలమైతే వాన. ఏదో ఒక సాకు.

ఆహార నియమాలు, వ్యాయామం రెండింటినీ గాలికి వదిలేస్తారు. ఒక్క మందుల మీదే ఆధారపడుతుంటారు. కనీసం నడవటానికైనా సమయం కేటాయించకపోతే గ్లూకోజు ఎలా తగ్గుతుంది?

## మందులపై అనుమానాలు

మొదట్లో మందుల మీద బాగానే శ్రద్ధ పెడతారు. జాగ్రత్తగానే వేసుకుంటారు. మధ్యలో ఒకసారో, రెండు సార్లో మూత్ర, రక్త పరీక్షలు చేయించుకుంటారు. గ్లూకోజు కంట్రోల్‌లో ఉంటే తగ్గిపోయిందని భావిస్తారు. మాత్రలు తగ్గించుకుంటారు. ఇష్టమున్నట్టుగా తింటారు. 'ఏమండీ ఏమిటిది?' అని డాక్టర్ అడిగితే 'షుగర్ మాత్రలతో నీరసం వచ్చింది. షుగర్ డౌన్ అయ్యిందని డోస్ తగ్గించాను. తగ్గింది కదాని ఆహారం విషయంలో కాస్త పట్టు సడలించాను' అంటారు. ఇలాంటి పొరపాటు చేయొద్దు. మందులు వేసుకోవటం మూలంగానే గ్లూకోజు అదుపులోకి వచ్చిందని గుర్తించాలి. అది అలాగే కొనసాగాలంటే మందులు క్రమంగా వేసుకోవటం తప్పనిసరి. రక్తంలో గ్లూకోజు బాగా పడిపోవటం (హైపోగ్లైసీమియా) ప్రమాదకరమైన పరిణామమే. డాక్టర్లంతా దీని విషయంలో అప్రమత్తం చేస్తారు. చేయాలి కూడా. కానీ చమటలు పట్టాయనో, నీరసంగా ఉందనో చీటికిమాటికి మందుల మోతాదు తగ్గించటం, మానెయ్యటం పెద్ద తప్పు. ఈ రోజుల్లో గ్లూకోమీటర్లు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చాయి. వీటితో ఐదు సెకండ్లలోనే రక్తంలో గ్లూకోజు మోతాదు తెలుస్తుంది. ఒకవేళ బాగా తక్కువగా ఉన్నట్టయితే ఆరోజు మాత్ర మానేసి, కొద్దిగా పంచదార నోట్లో వేసుకోవాలి. మర్నాడు డాక్టర్‌ను కలిసి జరిగింది చెబితే, మందుల మోతాదు సరిచేస్తారు. అంతే తప్ప తమకు తామే ఏదో అనుకొని మందులను మానెయ్యొద్దు.

## కొత్త మందుల మీద మోజు

చాలామందికి కొత్త మందులన్నా, ఖరీదు మందులన్నా మోజు. ఖరీదైన మందులు రాయండి, ఫర్వాలేదు, వేసుకుంటాం అని డాక్టర్లను అడుగుతుంటారు. ఆర్భాటంగానే మొదలెడతారు. కనిపించినవారికల్లా 'అబ్బా.. ఏం మందండీ. చిటికెలో షుగర్ కంట్రోల్ అయ్యింది' అని చెబుతుంటారు. ఆ తర్వాత వాటిని కొనుక్కోలేక ఇబ్బంది పడుతుంటారు. పాత మందులను ఇష్టం లేక మూలకు పడేస్తారు. ఇక కథ మామూలే. మందు ఖరీదుని బట్టి కాదు. అవి పనిచేసే తీరును బట్టి అవసరమైన వాటిని డాక్టర్లు నిర్ణయిస్తారు. పక్కింటివారు వాడుతున్నారని కొని వేసుకోవటం సరికాదు.

## ఇన్సులిన్ అంటే భయం

అవసరాన్ని బట్టి ఇన్సులిన్ ఇంజెక్షన్ వాడాలని డాక్టర్ అనగానే 'వద్దండి, వద్దండి. ఇన్సులిన్ ఒకసారి మొదలెడితే జీవితాంతం వాడాలట కదా. జబ్బు బాగా ముదిరితేనే ఇన్సులిన్ ఇస్తారట కదా. కిడ్నీలు చెడిపోయినా ఇస్తారట కదా. అంటే నా పని అయిపోయినట్టేనా? అంత సీరియసా?' అని బెంబేలెత్తుతుంటారు. వీటిల్లో ఏదీ నిజం కాదు. అంతా కేవలం అపోహ, భ్రమ. కొన్నిసార్లు క్లోమగ్రంథికి విశ్రాంతి ఇవ్వటానికి, మాత్రలు పనిచేయనప్పుడు, గర్భిణులకు, సమస్యలు తలెత్తినప్పుడు ఇన్సులిన్ వాడాల్సిన అవసరముంటుంది. ఇన్సులిన్ వాడిన తర్వాత మాత్రలు పనిచేయవట కదా అన్న సందేహం వద్దు. అవసరమైనప్పుడు ఇన్సులిన్ వాడిన తర్వాత కూడా గ్లూకోజును అదుపులోకి తెచ్చే మాత్రలు వేసుకోవచ్చు.

# టీమిండియా అలా మారటానికి.. విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి నే కారణం



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ కెప్టెన్ ధోనీ రిటైర్మెంట్ తర్వాత టీమిండియాలో వచ్చిన మార్పులపై కీలక వ్యాఖ్యలు చేశారు మాజీ వైస్ కెప్టెన్ అజింక్యా రహానే. ఇటీవలే అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన రహానే.. క్రికెట్ కు సంబంధించిన కీలక విషయాలను పంచుకున్నారు. ధోనీ తర్వాత టీమిండియా అలా మారటానికి కారణం కోహ్లీ, రవిశాస్త్రిలేనని అన్నారు.

ధోనీ రిటైర్మెంట్ టీమిండియాను ఒక క్లిష్టమైన దశలో పడేసిందని అన్నారు. ఆ సందర్భంలో టీమ్ మైండ్ సెట్ ను మార్చడంలో విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆటగాళ్లను డేరింగ్, డ్యాషింగ్ గా మార్చడంలో ఈ ఇద్దరు ఎంతో చేశారని అన్నారు. ముఖ్యంగా ఓవర్సీస్ కండిషన్స్ లో టీమ్ మైండ్ సెట్ ను సెట్ చేయడంలో హెడ్ కోచ్ రవిశాస్త్రి, కోహ్లీల పాత్ర మరువలేనిదని అన్నారు. మైకేల్ వాన్, సర్ అలస్టిర్ కుక్, ఫిల్ టఫ్నెల్, డేవిడ్ బంబెల్ లలాయిడ్ కలిసి స్టిక్ టు క్రికెట్ పాడ్ కాస్ట్ లో పాల్గొన్న రహానే ఈ వ్యాఖ్యలు చేశారు. 2014-15లో ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీ మధ్యలో ధోనీ రిటైర్ అయినప్పుడు, కోహ్లీ టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించాడు. కోహ్లీ తన టీమ్ కు దూకుడుగా ఉండేలా తయారు చేశాడు. ఇది ఇండియాను ప్రపంచంలోనే బలమైన ట్రావెలింగ్ టీమ్ గా ఎదగడానికి సహాయపడింది. ఆ టైమ్ లో టీమ్ లో ఉన్న రహానే, టీమ్ మెంటాలిటీని మార్చినందుకు కోహ్లీకి, అప్పటి హెడ్ కోచ్ రవిశాస్త్రికి ఈ క్రెడిట్ ఇచ్చాడు. ఎంఎస్ ధోనీ టెస్ట్ క్రికెట్ నుండి తప్పుకున్నప్పుడు, విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి భారత క్రికెట్‌ను, ముఖ్యంగా విదేశీ టెస్టుల్లో మరింత పటిష్టం చేశారు. రక్షణాత్మకంగా కాకుండా, మరింత అగ్రెసివ్ గా, ధైర్యంగా, ముందుచూపుతో ఆడేవాళ్ళుగా మారినట్లు రహానే అన్నారు.

మొదటి బంతి నుంచే దాడి చేయాలనిపిస్తే, అలాగే చెయ్యి

అని విరాట్ నాకు ఎప్పుడూ చెప్పేవాడు. ఆయన ఆటగాళ్లకు నిర్భయంగా ఆడేందుకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చారు, అని చెప్పారు. కోహ్లీ, శాస్త్రిల సారథ్యంలో ఇండియా టెస్ట్ దశల్లో అత్యంత విజయవంతమైన దశను ఆస్వాదించింది. ఆస్ట్రేలియాలో చారిత్రాత్మక సిరీస్‌లను గెలుచుకోవడం, ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకోవడం, తొలి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించడం వంటివి వీళ్లిద్దరి కాంబోలోనే జరిగాయి.

# టీమిండియా మరో బిగ్ షాక్.. శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు స్టార్ బ్యాటర్ దూరం..!



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరగనున్న టెస్ట్ సిరీస్?కు ముందు టీమిండియాకు మరో బిగ్ షాకే తగిలే అవకాశం ఉంది. గాయం కారణంగా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఇప్పటికే ఈ సిరీస్?కు దూరమైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగానే.. స్టార్ బ్యాటర్ సాయిసుదర్శన్ సైతం శ్రీలంకతో జరగనున్న తొలి టెస్ట్?కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. గత నెలలో శ్రీలంక ఏతో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్?లో సాయిసుదర్శన్ గాయపడ్డాడు.

కాలి వేలికి గాయం కావడంతో ప్రస్తుతం బెంగళూర్?లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. ఆగస్ట్ 15 నుంచి సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆగస్ట్ 4న టీమిండియా శ్రీలంకకు వెళ్లింది. సాయిసుదర్శన్ మాత్రం భారత జట్టుతో ప్రయాణించలేదు. గాయం పూర్తిగా నయం కాకపోవడంతో అతడు తొలి టెస్ట్?కు దూరమయ్యే అవకాశం ఉంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పైనే అతను ఈ సిరీస్?లో ఆడుతాడా లేదా అనే దానిపై ఆధారపడి ఉంది. సాయిసుదర్శన్ కండిషన్?పై బీసీసీఐ వర్గాలు అప్డేట్ ఇచ్చాయి. "శ్రీలంకతో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి టెస్టుకు సుదర్శన్ దూరమయ్యే అవకాశం ఉంది. సుదర్శన్ ప్రస్తుతం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ఉన్నారు. ఆగస్టు 4న భారత జట్టుతో పాటు అతడు శ్రీలంక ప్రయాణించలేదు. సుదర్శన్ కాలి వేలి గాయం నుంచి కోలుకుంటు గంటకు పైగా నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. రాబోయే మూడు, నాలుగు రోజుల పాటు అతని పరిస్థితిని పర్యవేక్షించిన తర్వాతే.. అతను ఆడేందుకు అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై తుది నిర్ణయం అధికారులు తీసుకుంటారు. అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చే ముందు అతను పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని నిర్ధారించుకోవడం ముఖ్యం" అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ టెస్ట్ సిరీస్?లో ఇండియా, శ్రీలంక మధ్య రెండు మ్యాచులు జరగనున్నాయి. ఆగస్ట్ 15 తొలి టెస్ట్, ఆగస్ట్ 23న రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ కు వెళ్లాలంటే టీమిండియాకు ఈ సిరీస్ ఎంతో కీలకం. దీంతో ఎలాగైనా సిరీస్ గెలవాలని గిల్ సేన పట్టుదలతో ఉంది. మరోవైపు.. సొంతగడ్డపై ఇండియాను చిత్తు చేయాలని శ్రీలంక ఉవ్విళ్లూరుతోంది.

# ఇంగ్లాండ్ పౌరసత్వం పొందిన పాక్ క్రికెటర్ ఆమిర్.. ఐపీఎల్ 2027లో ఆడటంపై కీలక వ్యాఖ్యలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అధికారికంగా ఇంగ్లాండ్ పౌరసత్వం (యుకే పౌరసత్వం) పొందడంతో ఆయన ఐపీఎల్ (ఖూూ)లో ఆడటంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. బ్రిటిష్ పాస్‌పోర్ట్ రావడంతో ఆమిర్ ఇప్పుడు ఇంగ్లాండ్ దేశవాళీ క్రికెట్‌తో పాటు 'ది హండ్రెడ్' టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ తరఫున లోకల్ ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు.

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పాక్ ఆటగాళ్లపై ఐపీఎల్‌లో నిషేధం ఉన్నప్పటికీ... గతంలో పాకిస్థాన్ ఆల్‌రౌండర్ అజర్ మహమూద్ బ్రిటిష్ పౌరసత్వం పొంది కింగ్స్ ఎలెవెన్ పంజాబ్, కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో ఆడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే నిబంధనల ప్రకారం మహమ్మద్ ఆమిర్‌కు కూడా ఇంగ్లాండ్ ప్లేయర్‌గా ఐపీఎల్ వేలంలో పాల్గొనే అర్హత లభించింది. ఈ సందర్భంగా ఆమిర్ స్పందిస్తూ... "2027 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో నేను విదేశీ ప్లేయర్ గా ఆడతాను. ఇక ఐపీఎల్ విషయానికి వస్తే... నేను అందులో పాల్గొంటానో లేదో ఇప్పటికైతే నాకూ తెలియదు, ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి ఐపీఎల్ పాల్గొనడంపై ఎలాంటి ప్రణాళికలు ఖరారు చేయలేదని, ముందుగా ప్రస్తుతం ఆడుతున్న లీగ్‌లపైనే శ్రద్ధ పెట్టినట్లు తెలిపాడు.




# హీరో కాదు.. బ్రాండ్‌గా మారుతున్న కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం కెరీర్‌ను గమనిస్తే ఇటీవల ఓ ఇంట్రెస్టింగ్ ట్రెండ్ కనిపిస్తోంది. ఆతని సినిమాల సంఖ్య కంటే ప్రాజెక్ట్ సెలెక్షన్ స్ట్రాటజీపై ఇండస్ట్రీలో ఎక్కువ డిస్కషన్ జరుగుతోంది. ముఖ్యంగా వరుసగా కొత్త డైరెక్టర్ లతో సినిమాలు చేయడం, ఒకేసారి సినిమా, వెబ్ సిరీస్, అలాగే దర్శకత్వ బాధ్యతలను కూడా తీసుకోవడం ద్వారా తన కెరీర్‌ను కేవలం హీరోగా కాకుండా ఒక క్రియేటివ్ బ్రాండ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది.

సాధారణంగా వరుస సక్సెస్‌ల తర్వాత చాలా మంది హీరోలు సేఫ్ జోన్‌లోకి వెళ్లి, ఆల్రెడీ పేరు తెచ్చుకున్న డైరెక్టర్లతో వర్క్ చేయడానికి ఆసక్తి చూపిస్తారు. కానీ కిరణ్ అబ్బవరం మాత్రం కొత్త కథలు, కొత్త డైరెక్టర్లు, కొత్త ఫార్మాట్ల వైపు అడుగులు వేస్తుండటం భిన్నమైన స్ట్రాటజీగా మారింది. ఇది కమర్షియల్‌గా రిస్క్ అయినప్పటికీ, లాంగ్ టర్మ్ కెరీర్ బిల్డింగ్ పరంగా చూస్తే ఒక స్పష్టమైన ప్లాన్ ఉన్నట్టు కనిపిస్తోంది. చెన్నై లవ్ స్టోరీ సక్సెస్ తర్వాత స్వీయ దర్శకత్వంలో సినిమా చేస్తున్న కిరణ్, తాజాగా మరో కొత్త డైరెక్టర్ కు అవకాశమిచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఒకేసారి సినిమా షూటింగ్, వెబ్ సిరీస్ కమిట్‌మెంట్స్, అలాగే దర్శకత్వ పనులను బ్యాలెన్స్ చేస్తున్న తీరు కూడా గమనించదగ్గ అంశం. ఈ మల్టీటాస్కింగ్ విధానం కేవలం బిజీ షెడ్యూల్‌కు పరిమితం కాదు. థియేటర్ ఆడియన్స్ తో పాటూ ఓటీటీ ఆడియన్స్ ను కూడా చేరుకోవడం, క్రియేటివ్ కంట్రోల్ ను పెంచుకోవడం, ఫ్యూచర్ లో తన బ్రాండ్‌ను విస్తరించడం వంటి అంశాలు ఇందులో భాగంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కొత్త డైరెక్టర్లకు అవకాశాలు ఇవ్వడం కూడా మరో ఇంట్రెస్టింగ్ అంశం.

ఇటీవల టాలీవుడ్‌లో చాలా మంది యంగ్ డైరెక్టర్లు కొత్త కథలతో ముందుకు వస్తున్నారు. అయితే వారికి గుర్తింపు ఉన్న హీరోల సపోర్ట్ లభిస్తేనే ఆ ప్రాజెక్టులు వేగంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త టాలెంట్‌తో పనిచేయడానికి కిరణ్ చూపిస్తున్న ఆసక్తి, ఇండస్ట్రీలో క్రియేటివ్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసే దిశగా కూడా చూడవచ్చు. అయితే ఈ స్ట్రాటజీలో ఛాలెంజెస్ కూడా తక్కువేమీ కాదు. కొత్త డైరెక్టర్లతో పని చేయడం అంటే స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ నుంచి ఎగ్జిక్యూషన్ వరకు అనేక అనిశ్చితులు ఉంటాయి. అదే సమయంలో ఒకేసారి పలు ప్రాజెక్టులను నిర్వహించడం వల్ల వర్క్‌లోడ్, టైమ్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అయినా, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం తీసుకుంటున్న డెసిషన్స్ చూస్తే ఆయన టార్గెట్ కేవలం వరుస సినిమాలు చేయడం కాదని, కొత్త డైరెక్టర్లకు అవకాశమిస్తూ, మంచి కథలను ఆడియన్స్ వద్దకు తీసుకెళ్లే దిశగా, థియేటర్- ఓటీటీ రెండింటిలోనూ గుర్తింపు ఉన్న నటుడిగా, అవసరమైతే డైరెక్టర్ గానూ తన గుర్తింపును విస్తరించే మల్టీ డైమెన్షనల్ కెరీర్‌ను నిర్మించుకోవడమే అనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మున్ముందు ఈ ధోరణే ఆయనను ఇతర యంగ్ హీరోల నుంచి వేరు చేసే ప్రధాన అంశంగా మారే అవకాశం ఉంది.



ఆకర్షణీయమైన రూపంతో అందరి హృదయాలను గెలుచుకుంటోంది.





మేధా శంకర్ గ్లామరస్ మెరుపు మరియు బాలీవుడ్ ప్రస్థానం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965